RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| | | | | | |
|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 43 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, జులై,31, 2025 | పేజీలు : 8   వెల : రూ.4/- |
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 43 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, July, 31, 2025 | PAGES : 8   RS : 4 /- |




## జమ్మూకశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్

### ఇద్దరు ఉగ్రవాదులు హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. పూంచ్ సెక్టార్‌లో ఈ రోజు ఉదయం చోటుచేసుకున్న ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. పహల్గాం దాడిలో పాల్గొన్న ముగ్గురు ముష్కరులను ఆపరేషన్ మహాదేవ్ ద్వారా హత మార్చిన రోజుల వ్యవధిలోనే ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం. పూంచ్ సెక్టార్‌లోని జెన్ ప్రాంతంలో కంచె వెంబడి బుధవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో భద్రతా దళాలు వెంటనే కాల్పులు జరిపాయి.




## రష్యాలో భారీ భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8.8గా నమోదు
- సునామి హెచ్చరికల జారీ
- రష్యా తీరంతో పాటు, జపాన్‌పైనా ప్రభావం
- అత్యవసర హెచ్చరికలు జారీ

సైరన్ల మోతతో వీధుల్లోకి వచ్చిన జనం

మాస్కో : రష్యాలో భారీ భూకంపం బుధవారం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8.8 గా నమోదైనది. రష్యా తీరంలోని కమ్చట్కా ద్వీపకల్పంతో పాటు- జపాన్‌కు సునామి హెచ్చ రికలు జారీ చేశారు. 3 మీటర్ల ఎత్తులో అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించా రు. అమెరికాలో 2011లో సంభవించిన తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద భూకంపం అని అధికారు లు పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని రష్యా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. భూకంపనాలకు ప్రజలు భయాం దోళనతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఇళ్లలోని క్యాబినెట్‌లు కూలిపోవడం, అద్దాలు విరిగిపోవ డం, రోడ్లపై నిలిపిన కార్లు ఊగడం వంటి సిసి టివి ఫుటేజీలు విడుదల అయ్యాయి. ఈ నెలలో రష్యా లో అనేక భూకంపాలు సంభవించాయి. జూలై 20న రష్యాలో ఒక గంటలోపు ఐదు భూకం పాలు సంభవించాయి.



## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి

### 25 శాతం సుంకంపై ట్రంప్ బెదిరింపు!

వాషింగ్టన్: భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం స్పష్టం చేశారు. ఆగస్టు 1 గడువు ముగియడానికి కేవలం రెండు రోజుల ముందు ఆయనీ వ్యాఖ్యలు చేశారు. పరస్పర సుంకాలు విధించే అవకాశం ఉందని చెప్పారు. భారత్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, అయితే ఒప్పందం కుదరకపోతే భారత్‌పై 25 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. "భారత్ 25 శాతం సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది" అని ట్రంప్ స్పష్టం చేశారు. "భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు" అని పునరుద్ఘాటించారు. భారత్ తమ మిత్రదేశమేనని, తన అభ్యర్థన మేరకు పాకిస్థాన్‌తో యుద్ధం ముగించిందని ట్రంప్ పేర్కొన్నారు. గడువులోపు ఒప్పందం కుదరకపోతే భారత్ నుంచి కొన్ని ఎగుమతు లపై 20 శాతం నుంచి 25 శాతం వరకు సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. అయితే, కొత్త రాయితీలపై తొందరపడకుండా, ఆగస్టు మధ్యలో అమెరికా బృందం సందర్శన సమయంలో వాణిజ్య చర్చలను తిరిగి ప్రారంభించాలని భారత్ యోచి స్తోంది...



## నోట్ల కట్టల కేసులో జస్టిస్ వర్మపై సుప్రీం ఆగ్రహం

### తప్పు లేకుంటే ముందే ఎందుకు స్పందించలేదని ప్రశ్న

న్యూఢిల్లీ : నోట్ల కట్టల వ్యవహారం కేసు జస్టిస్ యశ్వంత్ వర్మను వెంటాడుతోంది. ఇక త్రిసభ్య విచారణ కమిటీ- ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై బుధవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. నోట్ల కట్టలు వర్మవిగా కమిటీ- తేల్చింది. అయితే కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.వర్మ తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. న్యాయమూర్తిని తొలగించా లని అంతర్గత విచారణ ప్యానెల్ చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మీ ప్రవర్తన నమ్మశక్యంగా లేదని.. రాజ్యాంగ విరుద్ధమని భావిస్తే విచారణకు ఎందుకు హాజరయ్యారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.



## సిఎం రేవంత్‌తో మీనాక్షి భేటీ

### పాదయాత్రతో పాటు పలు అంశాలపై చర్చ

హైదరాబాద్,తెలంగాణ దిశ : సీఎం రేవంత్‌రెడ్డి తో టీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బుధవా రం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు సీఎం రేవం త్‌రెడ్డితో చర్చించారు. పార్టీ నిర్మాణం, పాద యాత్ర, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాట కార్యాచరణపై మాట్లాడారు. దాదాపు గంటన్న రపాటు- సుదీర్ఘంగా చర్చించారు. 31వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టనుంది. ఆగస్టు 5,6,7 మూడురోజుల పాటు- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికై- ఢిల్లీలో కార్యాచరణ రూపొందించారు.



## ఎపి లిక్కర్ కుంభకోణంలో కీలక మలుపు

### - సిట్ దాడుల్లో హైదరాబాద్ శివారులో భారీగా డబ్బు పట్టివేత

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిట్ అధికారులు నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు జరుపుతూ వేకువజామున భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి సూచనల మేరకు 12 బాక్సుల్లో భద్రపరిచిన రూ. 11 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. కేసులో ఏ40గా ఉన్న వరుణ్ పురుషోత్తం ఇచ్చిన సమాచారం ఆధారంగా శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామంలో ఉన్న సులోచన ఫార్మ్ గెస్ట్ హౌస్‌లో సిట్ అధికారులు తనిఖీలు చేసి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏ1 రాజ్ కెసిరెడ్డి ఆదేశాల మేరకు ఏ40 వరుణ్, ఏ12 చాణక్య ఈ రూ. 11 కోట్లు దాచినట్లు సిట్ విచారణ సందర్భంలో అంగీకరించారు.



## రక్తం, నీరు కలిసి.. ప్రవహించలేవు

### భారత విదేశాంగ శాఖామంత్రి జైశంకర్

న్యూఢిల్లీ : నేడు రాజ్యసభలో ఆపరేషన్ సింధూర్‌పై భారత విదేశాంగ శాఖామంత్రి జైశంకర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ ఎలాంటి సీమాంతర ఉగ్రవాదాన్ని సహించదని చెప్పారు. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడితే.. ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రతిస్పందించిందని, అది కొనసాగుతుందని ఆయన చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడి పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. పాకిస్తాన్ ఎర్రటి గీత దాటింది. దానికి జవాబుదారీతనం, న్యాయం ఉండాలని ఆ దిశగానే ఆపరేషన్ సింధూర్ చేపట్టినట్లు ఆయన చెప్పారు. అలాగే భారత్ - పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందంలో ఏ దేశం (అమెరికా) జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు.



## నేటి నుంచి మీనాక్షి పాదయాత్ర

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నేటి జులై 31 నుండి తెలంగాణలో పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలతో సంబంధాలను బలపరచడం, ప్రభుత్వ విధానాలను ప్రచారం చేయడం కోసం అని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. వారం రోజుల షెడ్యూల్ ను ఖరారు చేశారు. రోజుకో నియోజకవర్గంలో ప్రతి నియోజకవర్గంలో 8 నుండి 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తారు. పూర్తి డీటైల్స్ ప్రకటించాల్సి ఉంది. మీనాక్షి నటరాజన్ ఫిబ్రవరిలో తెలంగాణ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు.



## గులాబీకి దూరమౌతున్న.. కేసీఆర్ సహచరులు

హైదరాబాద్, జూలై 30,తెలంగాణ దిశ : తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూ దనాచారి.. టిఆర్ఎస్ వ్యవస్థాపక నాయకుడు ? తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌కు కుడి భుజంగా వ్యవహరించిన అత్యంత సన్నిహితుడు. కేటీఆర్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వక ముందు నుంచే ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి రాజకీ యాల్లో ఫోకస్ అయిన సీనియర్.. అలాంటి నాయకునిపైనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కక్షగట్టారట. రాజకీయాల నుండి పక్కకు తప్పించే ప్రయత్నం చేస్తున్నారట. దీంతో ఆ నియోజకవర్గంలోని రాజకీ యాలు?.కేసిఆర్ వర్సెస్ కేటీఆర్ అనేలా మారాయన్న టాక్ హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు.. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు మధుసూదనాచారి. తొలి తెలంగాణ సభాపతి, ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అంటే తెలుగు రాజకీయాల్లో తెలియని వారు ఉండరు.

# దొంగతనాల గ్యాంగ్ అరెస్ట్

## - రూ. 3.5 లక్షల విలువైన ఆస్తి స్వాధీనం



**కుత్బుల్లాపూర్, జూలై 30, (తెలంగాణ దిశ)** :ఒక్క ఫిర్యాదుతో దొంగతనాలకు పాల్పడే ముఠాను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి ఐదుగురు నిందితులను కటకటాల వెనక్కి నెట్టారు. నిందితుల నుండి రం 3. 5 లక్షల విలువైన రెండు మోటార్ సైకిళ్ళు 9 మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 27న అఖిల అను యువతి షాపూర్ నగర్ బస్ స్టాప్ సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా బ్లాక్ కలర్ బైక్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె చేతిలో నుండి మొబైల్ ఫోన్లు లాక్కొని పారిపోయారు. దీంతో బాధితురాలు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు రాగానే జీడిమెట్ల పోలీసులు క్రైమ్ పార్టీ ను, ఇతర విభాగాల పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో జీడిమెట్ల పోలీసులు షాపూర్ నగర్ లోని అందుబాటులో ఉన్న సిసి టీవీ ఫుటేజీలను విశ్లేషించి, టెక్నికల్ సర్వే లైన్స్, అనుమానితుల డేటాబేస్ ద్వారా తమ పరిశోధనలను ముమ్మరం చేశారు. అంతేకాకుండా పాత కేసుల్లో మోడస్ అపెరండి (చర్యల పద్ధతి) పరిశీలించి, పాత కేసుల్లో ఉన్న అనుమానితులను శోధించడం మొదలుపెట్టారు. బాధితురాలు అఖిల చెప్పిన దొంగల గుర్తులతో పోలిన వ్యక్తులను అనుమానించి వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో ఐదుగురు వ్యక్తుల దొంగల ముఠా గుట్టు రట్టయింది. దొరికిన దొంగల ముఠా సభ్యులు మద్యం మరియు గంజాయికి బానిసలై ప్రతిరోజు సాయంత్రం విజ్ఞాన్పురి కాలనీ మెట్రో స్టేషన్ వెనుక, సంగీత నగర్, కూకట్పల్లి, జగద్గిరిగుట్ట బస్ స్టాప్ ప్రాంతాలలో సమావేశమయ్యేవారు. మత్తులో వారు కూకట్పల్లి, జీడిమెట్ల, మాదాపూర్, జేఎన్టీయూ, ప్రశాంత్ నగర్, మూసాపేట్ తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ ఒంటరిగా వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకొని మొబైల్ ఫోన్లను మాట్లాడుకుంటూ వెళ్లే వారిని అందులో ప్రత్యేకించి మహిళలను టార్గెట్ చేస్తూ సెల్ఫోన్లో దోపిడీకి పాల్పడేవారు. అలాగే వాహన దొంగతనాలను కూడా చేస్తూ తమ వ్యసనాలకు డబ్బు సంపాదించుకునేవారు. జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసిన వారిలో కూకట్ పల్లికి చెందిన ఆర్ వై. జయంత్ అలియాస్ వరుణ్ (19), దీనబంధు కాలనీకి చెందిన ఆర్. శివ (21), జగద్గిరిగుట్ట అంజయ్య నగర్ కు చెందిన ఆర్ నరేష్ నాయక్ (23), జగద్గిరిగుట్టకు చెందిన కుమార్, అదే బస్తీకి చెందిన వెంకట్ లు గ్యాంగ్ గా ఏర్పడి మహిళల నుండి సెల్ ఫోన్లను, ద్విచక్ర వాహనాలను దోపిడీ చేశారు. గతంలో కూడా పలు మొబైల్ ఫోన్ల దొంగతనాలు, వాహన చోరీలలో ఈ నిందితుల భాగస్వామ్యం ఉంది. నిందితుల నుండి రెండు మోటార్ సైకిల్, తొమ్మిది మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వీటి విలువ సుమారుగా రూ. 3.5 లక్షలుగా పోలీసులు లెక్కించారు. చోరీలకు పాల్పడిన వారిని సమయస్ఫూర్తితో, సాంకేతిక అండతో ఛేదించి నిందితులను అరెస్టు చేసిన జీడిమెట్ల పోలీసులను పోలీసు ఉన్నతాధికారులు ప్రశంసించారు. బాలానగర్ ఏసిపి పి నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో జీడిమెట్ల ఇన్స్పెక్టర్ జి మల్లేష్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎస్ కనకయ్య, జీడిమెట్ల డిఎస్ఐ ఎన్ శ్యాంబాబు, జీడిమెట్ల ఏఎస్ఐ ఆర్ శ్రీనివాసరెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు ప్రేమ్ కుమార్, టి. నరేష్, రాజ్ కుమార్, సుబ్బారావు, మోహన్ లను ఉన్నతాధికారులు అభినందించారు. బాలానగర్ డిసిపి కె. సురేష్ కుమార్ ఐపీఎస్, బాలానగర్ అదనపు డీసీపీ వి. సత్యనారాయణ లు ఈ కేసును శోధించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు బృందాన్ని అభినందించారు.

# నేడు పరిగి నుంచి కాంగ్రెస్ పాదయాత్ర ప్రారంభం

## - జిల్లా నుంచి పాదయాత్ర కు పెద్ద ఎత్తున తరలి కావాలి



**కుత్బుల్లాపూర్, జూలై 30, (తెలంగాణ దిశ)** :టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కలిసి సంయుక్తంగా పాద యాత్ర, శ్రమదానం కార్యక్రమా లను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిగి నుంచి ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ పాదయాత్రకు మేడ్చల్ జిల్లా నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు మేడ్చల్ కండ్లకోయలోని రింగ్ రోడ్డు టోల్ ప్లాజా నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకెళ్లడం, పార్టీని సంస్థాగతంగా మరింత పటిష్టం చేయడం, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, కార్యకర్తలు నాయకులతో సమన్వయం చేయడంలో భాగంగా ఈ పాదయాత్ర శ్రమదానం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పరిగి నియోజకవర్గం నుంచి ఈ యొక్క పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రావాలని ఆయన పిలుపు నిచ్చారు.

# విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్...

## - విద్యార్థులతో కలిసి భోజనం...







**కీసర, జూలై 30, (తెలంగాణ దిశ)** :కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. కీసరలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ యూనిఫామ్స్, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ పుస్తకాలను ఇచ్చారా.. లేదా అని ఆరా తీసారు. అలాగే హాస్టల్లో ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు.., మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం అందు తుందా లేదా అని తెలుసుకున్నారు. ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వసతి గృహంలో అందిస్తున్న విద్య బోధనపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఎంత మంది విద్యార్థులు చదువు కున్నారు. ఇంటర్, పదవ తరగతిలో గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కళాశాల సిబ్బందిని ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరిసర ప్రాంతాల్లో లైట్స్ లేవని, తద్వారా విద్యార్డులకు ఇబ్బందిగా ఉందని తెలుపగా, లైట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. విద్యార్డులకు మారుతున్న టెక్నాలజీపై అవగాహన కల్పిస్తూ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించాలని సంబంధిత భోదన సిబ్బందికి సూచించారు. తదనుగుణంగా కంప్యూటర్లను సమకూర్చుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం తరగతి గదులను అయన పరిశీలించారు. పదవ తరగతి విద్యార్డులకు గణిత శాస్త్రాన్ని బోధించారు. విద్యార్డుల పరిజానాన్ని పరిశీలించడానికి విద్యార్థులతోనే బ్లాక్ బోర్డుపై లెక్కల సమాధానాలను చేయించారు. అన్ని సబెక్టులలో పట్టు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించవచ్చునని విద్యార్డులకు కలెక్టర్ సూచించారు. వంటగదిని సందర్శించి నాణ్యతతో కూడిన పరిశుభ్రంగా ఆహార పదార్థాలను తయారు చేయాలని వంట చేసి వాళ్ళకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు.

భోజనం రుచికరంగా ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ఆహార పదార్థాలను విద్యార్డులు సక్రమంగా తినే విధంగా క్రమం తప్పకుండా పర్యవేక్షించా లన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకటరెడ్డి, జిల్లా పాఠశాలల కన్వీనర్ జి. రజినీకాంత్, ప్రిన్సిపల్ టి. మహాలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ, వ్యవసాయ శాఖ అధికారి మధవి తదితరలు పాల్గొన్నారు.


# ఫుడ్ డెలివరీ ఏజెంట్ల దుస్తుల్లో వచ్చి బంగారం దుకాణంలో చోరీ..



ఘజియాబాద్: ఉత్తరప్రదేశ్లోని ఘజియాబాద్ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఫుడ్ డెలివరీఏజెంట్లదుస్తుల్లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఓ బంగారం దుకాణం పాల్పడ్డారు. ఇందుకు సంబంధిం చిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీలో రికార్డయ్యాయి. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో బ్లింకిట్, స్విగ్గీకి చెందిన డెలివరీ ఏజెంట్ల దుస్తుల్లో హెల్మెట్లు ధరించిన వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్థానికంగా ఉన్న మాన్సి జ్యువెలర్స్లోకి చొరబడ్డారు. అక్కడ సిబ్బందిని బెదిరించి.. దుకాణంలోని డిస్ప్లేలో ఉన్న ఆభరణాలను దోచుకున్నారు. వాటన్నిం టినీ తమ బ్యాగుల్లోకి నింపుకుని అక్కడ నుంచి ఉడాయించారు. దుకాణం నుంచిదాదాపు 20కిలోల వెండి, 125 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లినట్లు దుకాణం యజమాని తెలిపారు. ఐదారు నిమిషాల్లోనే మొత్తం ఊడ్చుకెళ్లినట్లు పేర్కొన్నారు. తాను పోలీసులకు ఫోన్ చేసినట్లు చెప్పారు. 15-20 నిమిషాల్లో పోలీసులు వచ్చారని.. అయితే అప్పటికే దొంగలు పారిపోయినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# సాయి నికుంజ్ లే అవుట్లో వాటర్ ట్యాంక్ తొలగిస్తే మళ్లీ వాటర్ ట్యాంకే నిర్మించాలి






**కుత్బుల్లాపూర్, జూలై 30, (తెలంగాణ దిశ)** :సాయి నికుంజ్ లే అవుట్లో 21 సంవత్సరాలకు నేర్పించిన వాటర్ ట్యాంక్ ను కూల్చివేస్తే తిరిగి అదే స్థానంలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహమ్మద్ సాబేర్ అలీకి స్థానిక 17వ వార్డు కౌసల్య కాలనీ, ఆశాజ్యోతి ఉమెన్ నెట్వర్క్ అధ్యక్షురాలు రమణి మల్యాల కోరారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ కు సమర్పించిన పత్రంలో వాటర్ ట్యాంకును కూల్చేసి ఆ భూమిలో అనవసర నిర్మాణాల పేరుతో ఆక్రమణల నుంచి రక్షించాలని ఆమె కోరారు. సాయి నికుంజ్ లే అవుట్ సర్వే నెంబర్లు 307, 308, 318 లోని వాటర్ ట్యాంక్ కోసం సుమారు 300 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు.కౌసల్య కాలనీ సాయి నికుంజ్ లే అవుట్ అభివృద్ధి చేసిన సమయంలో 2004 అక్కడ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ను నిర్మించినట్లు తెలిపారు. ఈ భూమి ప్లాట్ నంబర్లు 14, 15 (వర్షా రెసిడెన్సీ అపార్ట్మెంట్), 11 (133 చదరపు గజాలుగా విభజించిన 2 ఇంటి గల స్థలం), 12, 13 (ఎస్ ఆర్ కె హైట్స్ అపార్ట్మెంట్) మధ్యలో ఉందన్నారు.ఈ స్థలంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ను తొలగించే ప్రతిపాదనలు చర్చలో ఉన్నాయని తెలిసిందన్నారు. ఈ ట్యాంక్ సుమారు 21 సంవత్సరాల క్రితం నిర్మించారని, సాధారణంగా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల లైఫ్ 30%-%50 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఈ విషయంలో సరైన సర్వే నిర్వహించి ప్రజాధనం వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కొంత మంది రాజకీయ నాయకులు వారి అనుచరులతో కలిసి ఈ ట్యాంక్ కూల్చివేసే అంశాన్ని ముందుకు తెచ్చి అక్కడ దేవాలయం లేదా ఇతర వాణిజ్య నిర్మాణాల కోసం భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలన ఆమె కోరారు. వివిధ కారణాల వల్ల ట్యాంకు తొలగింపు తప్పనిసరి అయితే భవిష్యత్తులో ఆ స్థలంలో మరో నూతన వాటర్ ట్యాంక్ తప్ప మరే ఇతర నిర్మాణాలను అంగీకరించమన్నారు. ఆ స్థలాన్ని పచ్చదనం కలిగిన పార్క్గా అభివృద్ధి చేయాలని ఆమె సూచించారు. దీంతో గ్లోబల్ వార్మింగ్, కాలుష్య నియంత్రణ కోసం ఉపయోగపడుతుందన్నారు. వ్ప్రభుత్వానికి నిధుల కొరత ఉంటే మా సొంత నిధులతో ఆ ప్రాజెక్టను చేపట్టి అభివృద్ధి చేయడానికి అనుమతి ఇవ్వాలని ఆమె కోరారు.

# భారత్లో మొదటిసారి అట్లీస్ వీసా సేల్ ప్రారంభం

## - ప్రముఖ దేశాల వీసాలు కేవలం రూ.1 తోనే
## - 'అట్లీస్ వన్ వే అవుట్' పేరుతో ఆగస్టు 4, 5 తేదీల్లో అందుబాటులో..




**హైదరాబాద్, జూలై 30, తెలంగాణ దిశ** : భారతీయ ప్రయాణీకుల కోసం అట్లీస్ ప్రత్యేక వీసా సేల్ ప్రారంభించింది. ప్రముఖ దేశాల వీసాలకు కేవలం రూ.1 తోనే దరఖాస్తు చేసుకోవచ్చు. 'అట్లీస్ వన్ వే అవుట్' పేరుతో ఆగస్టు 4, 5వ తేదీల్లో అట్లీస్ అధికార వెబ్సైట్లో అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా అట్లీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ మోహక్ నహ్తా మాట్లాడుతూ ఈ రెండు రోజుల సేల్లో భారతీయులు యూఏఈ, యూకే, వియత్నాం, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా, ఈజిప్ట్, హాంకాంగ్ తదితర దేశాలకు కేవలం రూ.ఒక్క రూపాయితో వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. యునైటెడ్ స్టేట్స్ లాంటి కొన్ని దేశాలకు అవసరమైన ఇన్పర్సన్ అపాయింట్మెంట్ బుకింగ్లు కూడా రూపాయికే లభించనున్నాయని పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్, కాండే నాస్ట్ ట్రావెలర్ నివేదిక ప్రకారం.. భారతీయులు 2024లో రూ. 664 కోట్లకు పైగా నాన్-రిఫండబుల్ వీసా ఫీజుల రూపంలో కోల్పోయారన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా అట్లీస్ ఈ ప్రత్యేకమైన వీసా సేల్ ప్రారంభించిందన్నారు. అతి తక్కువ ధరకు వీసాలు పొందే అవకాశం ఈ సేల్ ద్వారా కలుగుతోందన్నారు.

గత 60 రోజుల వ్యవధిలో అట్లీస్ వేదికపై వివిధ దేశాల కోసం సెర్చ్లో స్పష్టమైన వృద్ధి కనిపించిందన్నారు. వియత్నాం, ఇండోనేసియా, జార్జియా, యునైటెడ్ కింగ్డమ్ (యూకే), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి గమ్యస్థానాలపై గణనీయంగా పెరిగిందన్నారు. గత కాలంతో పోలిస్తే ఈ వృద్ధి 18 నుంచి 44 శాతం వరకు ఉందన్నారు. ఈ వృద్ధికి ప్రధానంగా టైర్ 1, టైర్ 2 నగరాల వినియోగదారులే కారణమన్నారు. ముఖ్యంగా జెన్ జెడ్, అంతకుముందు తరంలో ఈ ఉత్సాహం అధికంగా కనిపిస్తుందన్నారు. మొదటిసారి విదేశీ ప్రయాణానికి సిద్ధమవుతున్న వ్యక్తులే అధికమన్నారు. అంతర్జాతీయ పర్యటనలపై పెరుగుతున్న ఆసక్తి, ఆత్మవిశ్వాసానికి ఇది ప్రతీక అన్నారు. భారతీయ ప్రయాణికుల్లో ఎక్కువగా ప్రజాదరణ పొందిన దేశాలు యూఏఈ, యూకే కావడంతో ఆ వీసాలపై అత్యధిక డిమాండ్ ఉందన్నారు. ఈ ఒక్క రూపాయి వీసా సేల్ ద్వారా మరింత మంది ప్రయాణికులను కొత్త దేశాలను పర్యటించాలన్న ఉత్సాహాన్ని కలగ చేయడం మా లక్ష్యమన్నారు. వీసా ఖర్చుల వల్ల ఎవరూ వెనుకంజ వేయకూడదన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



**కుత్బుల్లాపూర్, జూలై 30, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజుల రామారం పరిధిలోని మహాదేవ పురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసుకున్న కార్యాలయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యం శ్రీరంగంతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, దళిత సేన ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ అవిజె జేమ్స్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల కృష్ణ, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, ఎండి. లాయక్, సోమన్న శ్రీధర్ రెడ్డి, ఎండీ జాకీర్, సంతోష్ ముదిరాజ్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

# ఇందిరానగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషి అభినందనీయం



**కుషాయిగూడ, జూలై 30, తెలంగాణ దిశ)** :కాలనీలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించేందుకు కృషి చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఇందిరానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి. వి. నరసింహారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జలమండలి నుంచి రూ. 15 లక్షలతో చేపట్టనున్న యూజీడి పైప్ లైన్ నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారెడ్డి భాస్కరచారి మాట్లాడుతూ యుజీడి పైప్ లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కాటేపల్లి శివారెడ్డి, ప్రతినిధులు సారా అనిల్ కుమార్, రాధాకృష్ణమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, రాంప్రసాద్, పిట్టల విజయ్ వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, మొగిలి రాఘవరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దాసరి కనకయ్య, జై కృష్ణ, సందీప్, శ్రీనివాస్, ప్రసాద్ రెడ్డి, సాయిబాబా, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మేకిన్ ఇండియా సక్సెస్ స్టోరీ

ఓవైపు రష్యా – ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది. మరోవైపు ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య వార్ సాగుతోంది. ఇజ్రాయెల్ – ఇరాన్ల మధ్య పరిమిత యుద్ధం జరిగింది. ఇదే సమయంలో ఇండియా – పాకిస్థాన్‌ల మధ్య కూడా యుద్ధం జరిగింది. అయితే, మిగతా యుద్ధాల్లో జరగని చర్చ ఇండియా – పాకిస్థాన్ యుద్ధం తర్వాత జరుగుతోంది. అదే ఆయుధాల వినియోగం. రష్యా ఉక్రెయిన్ కన్నా బలమైన దేశం. ఇజ్రాయెల్ యుద్ధ సన్నద్ధత, ఆయుధ వ్యవస్థల విషయంలో పాలస్తీనా, ఇరాన్ కన్నా బలమైన దేశం. కానీ ఈ రెండు దేశాలు తమ ప్రత్యర్థులపై దాడులు చేసే క్రమంలో వారి బలంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రష్యా రెండేళ్లుగా ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నా, ఆ యుద్ధంలో విజయం సాధించలేకపోతోందన్నది ప్రధాన ఆరోపణ. ఇక ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందినప్పటికీ, ఇరాన్ వేసిన కొన్ని రాకెట్లను అడ్డుకోలేకపోయిందన్న వాదన వినపడింది. బ్రహ్మోస్ క్షిపణులు ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా మన దేశం పాకిస్థాన్‌పై తొలిసారిగా బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించింది. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు ఉంది. భారత్ – రష్యా సంయుక్తంగా ఈ మిస్సైల్‌ను డిజైన్ చేసినప్పటికీ, మన దేశ సాంకేతికత, డిజైన్, తయారీలో భాగస్వామ్యం ఎక్కువగా ఉంది. ఈ క్షిపణికి మన దేశంలోని బ్రహ్మపుత్ర నది పేరును, రష్యాలోని మోస్క్వా నది పేర్లను కలిపి ఈ క్షిపణికి బ్రహ్మోస్గా నామకరణం చేశారు. ఈ మిస్సైల్ వేగం, కచ్చితంగా పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలు, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడంలో కీలకంగా పనిచేశాయి. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మన దేశీయంగా (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థ. ఇది సర్ఫేస్–టు–ఎయిర్ క్షిపణి వ్యవస్థ. ఇది మధ్య శ్రేణి క్షిపణులను, తక్కువ ఎత్తులో వచ్చే శత్రు డ్రోన్‌లను అడ్డుకునేందుకు వినియోగిస్తారు. దీని తయారీలో డీఆర్‌డీవోతో పాటు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి ఉత్పత్తి చేశాయి. ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్స్ 25 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంది. దీని వేగం సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణిస్తుంది. అంటే శబ్దం కంటే 2.5 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించే క్షిపణి వ్యవస్థగా చెప్పవచ్చు. దీనికి ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే, ఇది డ్రోన్‌లు, యుద్ధ విమానాలను, హెలికాప్టర్లను, వాటితో పాటు క్రూయిజ్ క్షిపణులను కూడా అడ్డుకోగలదు. అంతేకాదు, ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యం ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు ఉంది. ఇందులో ఏర్పాటు చేసిన రాజేంద్ర అనే రాడార్ వ్యవస్థ మల్టీపుల్–ఫంక్షన్ ఫేజ్డ్–అరే రాడార్ను వినియోగిస్తుంది. ఈ రాడార్ వల్ల ఒకేసారి అనేక టార్గెట్‌లను ఇది ట్రాక్ చేయగలదు. అప్పటికప్పుడు ఆ లక్ష్యాలను ఛేదించేందుకు ఆకాష్ క్షిపణులకు డైరెక్షన్ ఇవ్వగల సామర్థ్యం ఉంది. దీని ద్వారా పాకిస్థాన్ మన సరిహద్దుల నుండి ప్రయోగించిన డ్రోన్‌లను గుర్తించి, వాటిని జామ్ చేసి, ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. సైనిక స్థావరాలతో పాటు డ్రోన్ దాడుల నుండి ప్రజలను, వారి ఆస్తులను కాపాడటంలో విశేషంగా పనిచేశాయని చెప్పాలి. సరిహద్దులను దాటి వచ్చే డ్రోన్‌లను గుర్తించడం, వాటిని జామ్ చేసి ధ్వంసం చేయడం ఈ డీ4 యాంటీ–డ్రోన్ సిస్టమ్స్ పని. మన దేశంలోని కీలక సైనిక స్థావరాలు, వ్యూహాత్మక ప్రాంతాలు, నగరాలు, పట్టణాలను శత్రు డ్రోన్‌ల నుండి కాపాడే రక్షణ వ్యవస్థగా దీన్ని రూపొందించారు. తక్కువ రాడార్ క్రాస్ సెక్షన్ ఉన్న చిన్నపాటి డ్రోన్‌లను కూడా గుర్తిస్తుంది. డ్రోన్‌ల కమాండ్ అండ్ కంట్రోల్ సిగ్నల్‌లను, అలాగే సిగ్నల్‌లను గుర్తించి, ట్రాక్ చేస్తుంది. పగలు, రాత్రి తేడా లేకుండా డ్రోన్‌లను గుర్తించి నిర్ధారించడానికి, ట్రాక్ చేయడానికి ఇందులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రో–ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఉపయోగపడతాయి. ఇక ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ అల్గోరిథంలను వాడి, ఏ లక్ష్యాన్ని గుర్తించిందో ఆ టార్గెట్ ఉద్దేశాన్ని, ముప్పు ఎక్కడ ఉంది, ఏ స్థాయిలో ఉందని అంచనా వేసి, తదనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉంది. ఇది కృత్రిమ మేధస్సుతో కూడిన గగనతల నియంత్రణ, నివేదన వ్యవస్థగా చెప్పవచ్చు. ఏఐ ఆధారిత వ్యవస్థ. దీన్ని డీఆర్‌డీవో, ఇస్రో, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన వ్యవస్థే ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. ఇది కేవలం ఒక క్షిపణి వ్యవస్థగా చెప్పలేం. ఇది వైమానిక స్థావరాలు, రక్షణ సంస్థల ఆస్తులను శత్రువుల దాడుల నుంచి కాపాడుతుంది. శత్రువుల దాడులను ట్రాక్ చేయడం, వాటికి ప్రతిస్పందించడంలో సహాయం చేసే పాత్ర ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ప్రత్యేకత. వివిధ రక్షణ వ్యవస్థల నుంచి అంటే రాడార్లు, క్షిపణి వ్యవస్థలు, శాటిలైట్స్ నుండి వచ్చే సమాచారం సేకరించి, వాటిని పరిశీలించి, అవసరమైన సమాచారాన్ని ప్రాసెస్ చేసి అందిస్తుంది. ఇందులో ఉపయోగించే ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్‌లు, క్షిపణులు, విమానాలను ట్రాక్ చేసి గుర్తించడం, వాటిని ఎదుర్కొనేందుకు తక్షణ నిర్ణయాలను తీసుకుంటుంది. సాధారణ ఎయిర్ డిఫెన్స్‌లతో పోల్చితే ఆకాష్ తీర్ చాలా వేగంగా లక్ష్యాలను గుర్తించి, వేగంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. మానవ ప్రమేయం లేకుండానే శత్రు టార్గెట్‌లను గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు రక్షణ వ్యవస్థలకు ఆదేశాలు ఇవ్వగల సామర్థ్యం ఈ వ్యవస్థ ప్రత్యేకత. డ్రోన్ స్వార్మ్ అంటే ఒకే లక్ష్యాన్ని ఛేదించేందుకు ఎక్కువ సంఖ్యలో వచ్చే డ్రోన్‌లను అడ్డుకుని నియంత్రించగల సామర్థ్యం ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు ఉంది. పిస్టన్ డ్రోన్ అనేది పిస్టన్ ఇంజిన్‌తో నడిచే డ్రోన్. డ్రోన్‌లు సాధారణంగా ఎలక్ట్రిక్ మోటార్ల ద్వారా నడిచేలా తయారవుతాయి. ఇందుకు బ్యాటరీలను వినియోగిస్తారు. అయితే, పిస్టన్ డ్రోన్‌లు బ్యాటరీలతో వాడే ఎలక్ట్రిక్ మోటార్లతో కాకుండా పెట్రోల్ లేదా ఇతర ద్రవ ఇంధనాలతో పని చేసే పిస్టన్ ఇంజిన్‌ను వినియోగిస్తారు. పిస్టన్ ఇంజిన్‌లు ఎలక్ట్రిక్ బ్యాటరీల కంటే ఎక్కువ శక్తినిస్తాయి. ఎక్కువ సమయం పిస్టన్ డ్రోన్‌లు గాలిలో ఎగురగలవు. దీని ద్వారా సుదూర ప్రాంతాల్లో నిఘా పెట్టడానికి, మ్యాపింగ్ చేయడానికి వినియోగిస్తారు. సుదీర్ఘంగా నిర్వహించే మిషన్లకు ఇది చాలా ఉపయోగం. ఎక్కువ శక్తిని పిస్టన్ ఇంజిన్‌లు విడుదల చేయడం వల్ల ఈ డ్రోన్‌లు బరువు ఎక్కువ ఉండే పేలోడ్‌లు, కెమెరాలు, సెన్సర్‌లను తీసుకుని ప్రయాణించగల సామర్థ్యం ఉంటుంది. ఎలక్ట్రిక్ బ్యాటరీలు ఛార్జ్ టైం ఎక్కువ పడుతుంది. కానీ ఇంధనం నింపడం చాలా తేలిక, తక్కువ సమయంలోనే ఇవి పని చేసేందుకు రెడీగా ఉంటాయి. పిస్టన్ ఇంజిన్‌లు కఠినమైన వాతావరణంలోనూ, అధిక ఎత్తులో పని చేయగలవు. కొన్ని ప్రతికూలతలు లేకపోలేదు. పిస్టన్ ఇంజిన్‌లు ఎక్కువ శబ్దాన్ని చేస్తాయి. సైలెంట్ ఆపరేషన్లలో వీటిని ఉపయోగించడం ప్రమాదకరం. వీటి నిర్వహణ ఎలక్ట్రిక్ డ్రోన్‌లతో పోల్చితే కొంత కష్టమైన పని. ధర కూడా ఎక్కువ. అయితే, వీటిని ఆపరేషన్ సింధూర్‌లో వాడి ఉంటారని నిపుణులు చెబుతున్నప్పటికీ, నిర్దుష్టమైన ఆధారాలు మాత్రం లేవు. అయితే, ఈ దేశీయ తయారీ పిస్టన్ డ్రోన్ కూడా ప్రపంచవ్యాప్తంగా చర్చ సాగుతోంది. ఇలా ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియాలో భాగంగా దేశీయంగా తయారైన యుద్ధ సాంకేతికత, పరికరాలు సర్వత్రా చర్చకు దారి తీయడమే కాకుండా, ఆయా దేశాల మిలటరీ నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధికంగా ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల జాబితాలో తొలి ఐదు స్థానాల్లో నిలిచే భారత్ వైపు ఇప్పుడు ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. దేశీయ ఆయుధ వ్యవస్థలను అవి దిగుమతి చేసుకునే అవకాశం ఉందని ఇప్పటికే ఈ దిశగా మన రక్షణ రంగ వ్యవస్థలతోనూ, కేంద్ర ప్రభుత్వంతోనూ చర్చలు సాగుతున్నాయని మిలిటరీ నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో రక్షణ ఉత్పత్తుల్లో అమెరికా, యూరప్ దేశాలకు గట్టి పోటీనిచ్చే దిశగా ఇండియా సాగుతోందన్నది మాత్రం వాస్తవం.

# ఉసురు తీసిన దాంపత్య బంధం

### కుటుంబ కలహాలతో..
### భార్య, భర్త వేరువేరుగా ఆత్మహత్యలు



**కుత్బుల్లాపూర్, జూలై 30, (తెలంగాణ దిశ)** :భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ తగాదాలు ఇరువురి ఆత్మహత్యలకు దారితీసాయి. నగర శివార్లలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ప్రగతి నగర్ నిఖిలానగర్ శాంతివనం బి బ్లాక్ అపార్ట్మెంట్ లో నివసించే వేల్పూరి దుర్గా రాగిణి (22) కి వేల్పూరి దుర్గా శ్రీనివాసులు అనే వ్యక్తితో 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం గత పది రోజులుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో రాగిణి భర్త శ్రీనివాసులు ఆమెకు దూరంగా ఉంటూ వేరే ఇంట్లో నివసిస్తున్నాడు. అయితే బుధవారం ఉదయం రాగిణి తాను ఉంటున్న రూమ్ లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గత కొంతకాలంగా భర్తతో గొడవలు జరుగుతుండగా మధ్యవర్తులు ఇద్దరు మధ్య సఖ్యత కోసం ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆమె మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మరణించడంతో స్థానికులు ఆమె భర్త శ్రీనివాస్ కు సమాచారం ఇచ్చి తలుపులు బలవంతంగా తెరిచి చూడగా ఆమె ఉరివేసుకొని చనిపోయి ఉంది. తర్వాత రాగిణి భర్త వేల్పూరి దుర్గా శ్రీనివాసులు స్థానికుడు మల్లేశ్వర కు దుర్గారావు వద్దకు వచ్చి విషయాన్ని తెలియజేశారు అనంతరం మల్లేశ్వరరావు దుర్గారావు మరియు ఆయన భార్య శ్రీనివాసులు మరియు అతని కుమారుడు వేరువేరు బైకులపై తన భార్య మరణించిన సంఘటన స్థలానికి బయలుదేరారు. అనంతరం శ్రీనివాసులు వారితో కలిసి వెళ్లకుండా మధ్యలోనే తన బైక్ ని ఆపి వెన్ను తిరిగి వెళ్ళిపోయాడు. ఇది తెలియని మిగతావారు రాగిణి చనిపోయిన చోటికి వెళ్లి అక్కడ విషయాలు తెలుసుకుంటూ ఆమె చనిపోయిన విషయం మాట్లాడుకుంటూ ఉన్నారు.
చాలాసేపటి వరకు రాగిణి భర్త శ్రీనివాసులు అక్కడికి రాకపోవడంతో వారికి అనుమానం వచ్చింది. ఈలోపే దుర్గారావు కుమారుడు దుర్గారావు కి ఫోన్ చేసి వేల్పూరి దుర్గా శ్రీనివాసులు ఉంటున్న రూమ్ లోనే బెడ్ షీట్ తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు అని వివరించడంతో హుటాహుటిన వారంతా శ్రీనివాసులు మరణించిన రూము వద్దకు వెళ్లి పరిశీలించగా ఆయన అప్పటికే చనిపోయి ఉన్నాడు. కుటుంబంలో భార్యాభర్తల మధ్య చెలరేగిన మనస్పర్థలు ఇరువురి ఆత్మహత్యలకు కారణం కావడంతో స్థానికులు, ఇరువురి బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ఇద్దరి మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఫెర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**కీసర, జూలై 30, (తెలంగాణ దిశ)** :కీసరలోని ఫెర్టిలైజర్ షాపును జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలైజర్ షాపును ఆయన పరిశీలించారు, స్టాక్ రిజిష్టర్ ప్రకారం స్టాకును పరిశీలించారు. ఎరువులు, క్రిమి సహాకార మందులు కంపెనీల వారిగా ఎంత నిల్వ ఉన్నదని కలెక్టర్ పరిశీలించారు. అదే విధంగా ఎరువులు ఎక్కడ నుండి సరఫరా అవుతాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు, షాపు సిబ్బందితో మాట్లాడుతూ యూరియాను రైతులు అధిక మొత్తంలో వినియోగిస్తున్నందున, ఇతర ఎరువులపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేనందున దానికి అనుగుణంగా రైతులందరికి ఎరువులు, పురుగు మందులు వినియోగించడంపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే నకిలీ మందులు, ఎరువులు విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకటరెడ్డి, జిల్లా పాఠశాలల కన్వీనర్ జి. రజినీకాంత్, ప్రిన్సిపల్ టి. మహాలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ, వ్యవసాయ శాఖ అధికారి మధవి తదితరలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి



జయశంకర్ భూపాలపల్లి: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, భూ భారతి దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఐడిఓసి సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంలో వేగం పెంచాలని తెలిపారు. కాటారం డివిజన్ లోని పైలెట్ మండలాల్లో అన్ని ఇండ్ల నిర్మాణం చేపట్టాలని, లబ్ధిదారులకు అవగహన కల్పించాలని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆగస్టు 15వ తేది వరకు అన్ని దరఖాస్తులు విచారణ పూర్తి కావల్సి ఉందని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని, నీటి నిల్వల వల్ల దోమల విస్తరణను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా పంచాయతీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నా రు. ప్రతి డ్రై డే నిర్వహించి పరిసరాలు పరిశుభ్రం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఆర్డిఓ రవి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారం

### - సహకరించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి కాలనీవాసులకు కృతజ్ఞతలు





**నాగారం, జూలై 30 : (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలో నీటి సమస్యను బుధవారం కాంగ్రెస్ నాగారం మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పరిష్కరించారు. నీటి సరఫరాలో అంతరాయంతో పాటు బోరు ఖాళీ పోవడంతో సత్యనారాయణ కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోర్ వెల్ శ్రీనివాసరెడ్డి, కాలనీవాసులు నాగారం పట్టణ అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లారు. సకాలంలో స్పందించిన ముప్పు శ్రీనివాసరెడ్డి మున్సిపల్ అధికారులతో సంప్రదించి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన మోటర్ పరిష్కారానికి దగ్గరుండి సమస్య పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేశారు.
దీంతో ముప్పు శ్రీనివాస్ రెడ్డికి కాలనీతో పాటు సంక్షేమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్యా నాయక్, బోర్ వెల్ శ్రీనివాస్ రెడ్డి,టిజిఐఎస్ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి,ఎం శ్రీనివాస్ రెడ్డి, భద్రు నాయక్ కాలనివాసులు, సంక్షేమ సంఘం సభ్యులలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు నరేంద్ర విద్యాలయం విద్యార్థుల ఆర్థిక సహాయం

చొప్పదండి: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మి దేవిపల్లి గ్రామంలోని నరేంద్ర విద్యాలయం విద్యార్థులు అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖానికి చెందిన బాలల సంరక్షణ సంస్థ ప్రతినిధులు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించగా విద్యార్థులు, తల్లితండ్రుల సహకారంతో 9వేల 8వందల 50 రూపాయలు సంస్థ ప్రతినిధులకు అందించినట్లు పాఠశాల కారస్పాండెంట్ గుజ్జుల గోపాల్ రెడ్డి తెలిపారు.
ఈ విరాళాల సేకరణ ద్వారా విద్యార్థులకు సామజిక బాధ్యత తెలుస్తుం దని అన్నారు. విరాళాలు సేకరించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర రాజేశం, అధ్యాపకులు,బాల సంరక్షణ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల్లో అద్భుతమైన ప్రతిభ, నైపుణ్యం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి: దివ్యాంగుల్లో అద్భుతమైన ప్రతిభ, నైపుణ్యాలు ఉంటాయని, అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారత విభాగం ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్ 2025 ను సుభాష్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, పథకాల ద్వారా వారి ప్రతిభకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించాలని అన్నారు. మొట్ట మొదటి సారిగా మన జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందించారు. దివ్యాన్ గులల్లోని సృజనాత్మకత ను వెలికి తీయడానికి ఇదొక మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాన్గుల పథకాలు ప్రతి మారుమూల గ్రామ స్థాయికి చేర్చాలని, దివ్యాన్గులను గుర్తించి వారి ప్రతిభ ఆధారంగా అవకాశాలు కపిస్తే వైకల్యం తమ ప్రతిభకు అడ్డు కాదని నిరూపిస్తారని తెలిపారు. అధికారులు దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించి, వారి నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా దృష్టి పెట్టాలని సూచించారు. దివ్యాన్గుల సంక్షేమం సంక్షేమ శాఖ బాధ్యతని, సంక్షేమం, సౌకర్యాలు కల్పనకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. దివ్యాన్గులకు పాఠశాలల్లో విద్యాబ్యాసం, వృత్తి నైపుణ్యం, భవిత కేంద్రాలు నిర్వహణ, వారికి అవసరమైన పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. నేను మీకు అభయం ఇస్తున్నాను దివ్యాన్గులకు వర్తించే అన్ని పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల సమన్వయంతో అభివృద్ధి లో దివ్యాన్గులను భాగస్వాముల ను చేస్తూ చేయూతను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బుద్ధిమాంద్యంతో బాధపడే దివ్యాంగుల సాధికారత కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసేబులిటీఎస్ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18 ఎన్జీవోల స్టాళ్లు ఏర్పాటు చేయగా, వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. యూత్ ఫర్ జాబ్స్ సంస్థ ఉద్యోగ మేళా కోసం స్టాల్ ఏర్పాటు చేసింది. అలీం కో,ఐజినిష్ట్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి.

# శ్రద్ధతో నేర్చుకోండి.. స్వశక్తితో ఎదగండి

రామవరం: మహిళలు స్వసక్తితో స్వావలంబన సాధించి ఎదగాలనే ఆకాంక్షతో సింగరేణి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాలతో తేనె టీగల పెంపకం కార్యక్రమాన్ని ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజు తెలిపారు. ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ఆర్ సి ఓ ఏ క్లబ్‌లో తేనె టీగల పెంపకంపై శిక్షణ తీసుకుంటున్న మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో జీకేఓసి, వీకేఓసి ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతాల మహిళలకు కార్పొరేట్ సామాజిక బాధ్యతో తేనె టీగల పెంపకంపై మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, అగర్తల, వెస్ట్ త్రిపుర చెందినవారు ఉచిత శిక్షణతో పాటుగా సంబంధిత పరికరాలను ఇచ్చి స్వయం ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 120 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని, శిక్షణ అనంతరం తేనె టీగల పెంపకానికి సంబంధించిన పరికరాలను కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

# తెలంగాణకు భారీగా రైల్వే ప్రాజెక్టులు



**వరంగల్,తెలంగాణ దిశ :** ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు రవాణా రంగం కీలకం. అం దులో రైల్వే కనెక్టివిటీ ఎంతో ప్రాముఖ్యమైన రవాణా సౌకర్యం. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రం ఈదిశగా ముందుగు సాగుతోం దనే చెప్పాలి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా ప్రణాళికతో ముం దుకు సాగుతున్నాయి. అయితే, నిధుల కేటాయింపు సరిగా జరగడం లేదని, నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయన్న విమ ర్శలు ఉన్నాయి. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న రైల్వే లైన్లు, త్వరలో పూర్తి కానున్నవి, ప్రతిపాదన దశలో ఉన్నవి, సామర్థ్యం పెంచుతూ తీసుకు న్న నిర్ణయాల వల్ల తెలంగాణ రవాణా రంగ చిత్రపటాన్ని మార్చే అవకాశం ఉంది. వరంగల్ జిల్లాలో రూ. 500 కోట్లతో నిర్మిస్తున్న అత్యాధునిక రైల్వే కోచ్‌ల తయారీ కర్మాగారం తెలంగాణ లోని యువ తకు ఉపాధి కల్పించే దిశగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కర్మాగారాన్ని ఇటీవల సందర్శించిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మెగా అత్యాధునిక కర్మాగారంగా అభివర్ణించా రు. దీనికి సంబంధించిన సివిల్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి పూర్తవుతాయని, ఉత్పత్తి 2026లో ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందులో వందే భారత్ రైలు కోచ్‌లు, రైలు ఇంజన్లు, సరకు రవాణా వ్యాగన్లు ఉత్పత్తి చేస్తారు. భవిష్యత్తులో మెట్రో రైల్ కోచ్‌లు కూడా తయారు చేయవచ్చని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. రానున్న రోజుల్లో కాజీపేట రైల్వే కోచ్ కర్మాగారం స్థానిక యువతకు ఉపాధి కేంద్రంగా మారవచ్చు.భారతీయ రైల్వే వ్యవస్థలో వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టడం ఓ విప్లవాత్మక మార్పుగా అభివర్ణిం చవచ్చు. ప్రయాణికుల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. ఈ రైళ్లలో ప్రయాణించడానికి ప్యాసెంజర్స్ చాలా ఇష్టపడుతున్నారు. వారి డిమాండ్ మేరకు రైల్వే శాఖ వందే భారత్ రైళ్ల సామర్థ్యాన్ని పెంచడానికి నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్-విశాఖపట్నం వందే భారత్ రైలు 16 బోగీలతో నడిచేది. దీన్ని ఇప్పుడు 20 బోగీలకు పెంచారు. కాచిగూడ - యశ్వంత్ పూర్ (బెంగళూరు) వందే భారత్ రైలు 8 కోచ్‌లతో ప్రయాణించేది. దీన్ని ఇప్పుడు 16 కోచ్‌లకు పెంచా రు. దీంతో పాటు, సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్ రైలును ఏలూరు, సామర్లకోటలో స్టాపేజీలను మరో ఆరు నెలలపాటు పొడిగించే నిర్ణయం రైల్వే శాఖ తీసుకుంది. దీంతో ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇది ఎంతో ప్రయోజనకారి అవుతోం ది. ప్రజల నుంచి వచ్చిన అనూహ్య స్పందన, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన డిమాండ్లు, ఈ స్టేషన్లలో గణనీయంగా పెరిగిన టికెట్ల ఆదాయం కారణంగా రైల్వే శాఖ ఈ రెండు స్టేషన్లలో అదనపు స్టాపేజీలనుఆరు నెలలు పెంచాలని నిర్ణయం తీసుకుంది. దీని వల్ల ఏలూరు, సామర్లకోట నుంచిహైదరాబాద్ లేదావిశాఖపట్నం వెళ్లాలను కునే ప్రయాణికులు నేరుగా వందే భారత్ రైలు ద్వారా తక్కువ సమయంలో గమ్య స్థానం చేరే అవకాశం ఉంది.

తెలంగాణలో కొత్త రైల్వే సేవలను ప్రారంభించేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. హైదరాబాద్ - జోధ్‌పూర్ మధ్య కొత్తగా రోజు వారీ రైలు సౌకర్యాన్ని జులై 19 వ తేదీన ప్రారంభించారు. ఈ రైలు సేవ కల్పించాలని చాలా కాలం నుంచి హైదరాబాద్‌లోని రాజస్థానీ కమ్యూనిటీ కోరుతోం ది. దీంతో పాటు, ఘట్ కేసర్- యాదాద్రిగుట్ట ఎం.ఎం.టి.ఎస్. విస్తరణకు అడుగులు పడుతున్నాయి.

2016లో మంజూరయిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం వంద కోట్లు కేటాయించారు. ఇక కొత్త రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనల విషయానికి వస్తే ఔటర్ రింగ్ రోడ్ రైల్ ముఖ్యమైన ప్రాజెక్టుగా చెప్పవచ్చు. తెలంగాణ రీజనల్ రింగ్ రోడ్‌కు సమాంతరంగా 392 కిలోమీటర్ల ప్రతిపాదించిన ఈ రైల్వే ప్రాజెక్టుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే కూడా మంజూరయింది. రూ. 12,408 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నగరానికి, తెలంగాణ రాష్ట్రానికి ఓగేమ్ ఛేంజర్ అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పడం విశేషం. ఇక హైదరాబాద్-అమరావతి కొత్త రైలు మార్గంకు సంబంధించి భూసేకరణ పనులు జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లాలోని నంబూరు వరకు ఈ మార్గాన్ని నిర్మిస్తారు. రూ. 2245 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. భూసేకరణ పనుల్లో కొంత జాప్యం ఉందన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ భూమిని రైల్వే శాఖకు అప్పజెప్పగానే నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని రైల్వే శాఖ చెబుతోంది. రైల్వే శాఖను తెలంగాణ కోరుతున్న రైల్వే ప్రాజెక్టులు ఇవే: అయితే, మరిన్ని రైల్వే ప్రాజెక్టులు కావాలని తెలంగాణ రాష్ట్రం కేంద్ర రైల్వే శాఖ ముందు కొన్ని ప్రతిపాదనలు ఉంచింది. ఇటీవలే రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి ఈ కొత్త ప్రాజెక్టు ప్రతిపాదనలు ఆయనకు అందజేశారు. తెలంగాణలో వెనుకబడిన ప్రాంతాలను కలిపే రైల్వే లైన్లను ప్రాధాన్యతగా భావించి మంజూరు చేయాలని కోరారు. ఆ ప్రతిపాద నలు ఇవే: వికారాబాద్-కృష్ణా (122 కి.మీ): అంచనా వ్యయం రూ.2,677 కోట్లు. కల్వకుర్తి-మాచర్ల (100 కి.మీ): అంచనా వ్య యం రూ. 2,000 కోట్లు. డోర్నకల్-మిర్యాలగూడ (97 కి.మీ): అంచనా వ్యయం రూ. 2,184 కోట్లు. రైల్వే కార్యకలాపాలను మెరుగుపరచడానికి కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్ల నుంచి తెలంగాణ రాష్ట్రం డిమాండ్ చేస్తోంది. దీని వల్ల తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందుతుందన్న అభిప్రాయాన్ని ఇటీవలే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం గమనార్హం. దీంతో పాటు, హైదరాబాద్ డ్రై పోర్ట్ - బందర్ పోర్ట్ రైల్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కార్ కోరుతోంది. దీని వల్ల తెలంగాణ నుంచి ఎగుమతులు పెంచడంలో కీలకమని చెబుతోంది. ఇలా తెలంగాణలో నిర్మాణం పూర్తవనున్నవి, ప్రతిపాదన దశలో ఉన్నవి అన్నీ పూర్తయితే తెలంగాణ రైల్వే ముఖచిత్రం పూర్తిగా మారే అవకాశం ఉందని రవాణా రంగ, ఆర్థిక నిపుణుల భావన. రైల్వే కనెక్టివిటీ పెంచడం, రైల్వే కర్మాగారాల ఏర్పాటు, పోర్టు కనెక్టివిటీ, రైల్వే మౌలిక సదుపాయాల కల్పన కారణంగా తెలంగాణ రైల్వే నెట్ వర్క్ దేశంలో గుర్తించే స్థాయిలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నిధుల విడుదల పట్ల గ్రామస్తుల సంబరాలు



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** మండలంలోని సబ్బితం గ్రామంలో గల గౌరీ గుండాల జలపాతం అభివృద్ధికి రూ. 6 కోట్ల నిధులు విడుదల పట్ల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు సంబరా లు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చందా శంకర్ మాట్లాడుతూ పూర్వకాలం నుండి ఈ జలపాతం వున్నా గత పదిహేళ్ల నుండి పూర్తిస్థాయిలో ప్రాచుర్యం పొంది అనతికాలంలోనే పలు జిల్లాలనుండి ప్రతి నిత్యం పర్యాటకులు రావటం జరిగింద న్నారు. దీంతో సరైన వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడిన ఘటనలు వున్నాయని తెలిపారు. కాగా ప్రస్తుత ఎమ్మెల్యే విజయరామణ రావు గతంలో ఇచ్చిన హామీ మేరకు జలపాతం అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోనే ఒక మంచి పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న సందర్భంగా సబ్బితం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ చంద శంకర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేస్తూ భానసంచాలు పేల్చి,సీట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణ రావు,పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణా రావు, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ఎమ్మెల్యే చేసిన కృషిని పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కీర్తి హరీష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గుమ్మడి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకుడు కందుల అశోక్, నాయకులు నూనె రమేష్, సుద్దాల సతీష్, గంకిడి నారాయణ,మాదాసి రాజయ్య, చుంచు రాములు, కళ్లేపల్లి కిష్టయ్య, గాజుల అశోక్, మేడిపల్లి సంపత్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాల్సిందే

**కేంద్రం నిర్లక్ష్య వైఖరి విడాలి**

**బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇంఛార్జి జనగామ రవికుమార్**



**మంచిర్యాల,తెలంగాణ దిశ :** పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టి తీరాల్సిందే నని బహుజన్ సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్ జనగామ రవికుమార్ డిమాండ్ చేశారు. దేశంలో 3 శాతం ఉన్న సామాజిక వర్గానికి 10శాతం రిజర్వేషన్ లను రాత్రికి రాత్రే రిజర్వేషన్ బిల్లు అమలు అయ్యేటట్లు చేసిన ప్రధాని మోడీకి.. 60శాతం ఉన్న బీసీ లకు రిజర్వేషన్ లను అమలు చేయడానికి ఏ చట్టం, శాసనం అడ్డంగా మారిందే దేశ ప్రజలకు సమాధానం చెప్పవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంకు ఉంది.బీసీ రిజర్వేషన్ లపై కేంద్రం ప్రభుత్వంకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. దేశంలో 60శాతంకు పైగా ఉన్న బీసీలు చట్ట సభల్లోకి వెళ్ళవలసిన అవసరం ఎంతైనాఉందన్నారు. రాజ్యాంగం అమలు తరువాతబహుజన్ సమాజ్ పార్టీ చేసిన ఉద్యమంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి శాతం రిజర్వేషన్ లను బీసీలకు ఇచ్చిందన్నారు.అది కూడా కేవలం విద్య, ఉద్యోగాలలో మాత్రమే రిజర్వేషన్ లు అమలు అవుతున్నాయాన్నారు. కానీ చట్ట సభలో రిజర్వేషన్ లు అమలు కావడం లేదన్నారు.కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ కి ఏమాత్రం బీసీలపై చిత్తశుద్ధి ఉన్న ప్రస్తుతం జరిగే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు తీసుకరావాలని ఆయన డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లుపై నిర్లక్ష్య విడాలని ఆయన అన్నారు.

## జిల్లా కేంద్రంలో 10 ఎకరాల్లో ఆధునాతన సౌకర్యాలతో..

# చేపల మార్కెట్ ఏర్పాటు చెయ్యాలి




- చేప పిల్లలకు బదులు నగదు సొసైటీలో వెయ్యాలి
- ఎల్లంపల్లి ప్రాజెక్టులో 1 కోటి చేప,రొయ్య పిల్లలు వెయ్యాలి
- జిల్లా కేంద్రంలో మత్స్య భవన్ నిర్మించాలి
- బోడేంకి చందు తెలంగాణ మత్స్యకారుల మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డిమాండ్



**మంచిర్యాల,తెలంగాణ దిశ :** తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలో మత్స్యకారులేదుర్కొం టున్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేసి జాయింట్ కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బోడేంకి చందు మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ..జిల్లాలో మత్స్యకారులు విద్య, వైద్యం,రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని ప్రతి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేస్తుందనిగొప్పలు చెప్పుకోవడం తప్ప అంటే మాటలు కోటలు దాటిన చేతులు గడపలు దాటవు అన్నట్లు మత్స్యకారులకు ఒరిగిందేమీ లేదు.గత ప్రభుత్వంలో ఉచిత చేప పిల్లల పేరుతో కాంట్రాక్టర్లు అధికారులు జేబులు నింపుకున్నారు . తప్ప మత్స్యకారులు మాత్రం ఎక్కడికొంగడు అక్కడే అన్నట్లు. అరకువ తిండితో చాలీచాలని బ్రతుకులీడు స్తున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం మత్స్యకారులకు ఊసే లేదు. మత్స్యకారుల సంక్షేపానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్ఎఫ్‌డిబి, ఎన్‌సిడిసి, నాబార్డ్ ద్వారా సబ్సిడీతో రుణాలు అందించాల్సి ప్రభుత్వం అందించడం లేదు. ప్రతి మత్స్య సొసైటీ చలబండ్లకు సరిపోయేంత నగదు బదిలీ చేయాలని, జిల్లా మండల కేంద్రాల్లో హోల్, సేల్ చేపల మార్కెట్లో నిర్మించి ఇవ్వాలని, జిల్లాలో భూముల రేట్లు పెరిగిపోయిన సందర్భంగారియల్ఎస్టేట్,కబ్జాదారులు చెరువుల, కుంటలు పూర్తిగా ఆక్రమణకు గురవుతున్నాయని, ప్రతి మత్స్య సొసైటీ కి కమ్యూనిటీ హాల్ ఇవ్వాలని, చేపల వేట నిషేధ కాలంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి జీవనభృతి కింద 20 వేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేషన్, ఇవ్వాలని, అర్హులైన ప్రతి సొసైటీ సభ్యులకు బైకు, టూ వీలర్,ఫోర్ వీలర్స్ వలలు, బోట్లు మంజూరు చేయాలని,50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు 5000 పింఛన్ ఇవ్వాలని, అన్నారు. పై సమస్యలు పరిష్కారం గాని ఎడల రాబోయే రోజులలో ఉద్యమంలో ఉదృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమానికి సంకె రవి రైతు సంఘం అధ్యక్షులు, ఉమారాణి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి, మద్దతు తెలిపారు,, ఈ కార్యక్రమంలో జునిగారి నారాయణ, కంపల చంద్రయ్య,పిట్టల దశరథం, జిల్లా ఉపాధ్యక్షులు, మంచిర్ల రాజేందర్,గగ్గురి రాజన్న, బోగుట వెంకటేష్, నాగుల మహేష్, గగ్గురి రాజన్న,గుమ్మల ఆశన్న, పానం రాజన్న,గగ్గూరి రాజన్న, బోండ్ల సరిత, రమాదేవి, బోగుట రాజన్న,వివిధ మత్స్యకార సొసైటీ సభ్యులు పాల్గొన్నారు

## విద్యార్థుల కోసం బస్సు నడుపండి

**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ :** మారుముల అటవీ గ్రామాల నుంచి మహాదేవపూర్ కళాశాలకు వచ్చే విద్యార్థుల కోసం బస్సు నడుపాలని భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందు కు ప్రిన్స్ పాల్ నర్సయ్య విజ్ఞానపత్రం సమర్పించారు. పలిమేల మండలం లోని సర్వాయిపేట, పలిమేల, పంకేన, లెంకలగడ్డ నుంచి మహాదేవపూర్ మండలం లోని పెద్దంపేట, అంబటి పల్లి, సూరారం, యాన్కపల్లి, రాపల్లి కోట, బెగుళూరు గ్రామాల నుంచి విద్యార్థులు కళాశాలకు వస్తున్నారు. వారి సౌకర్యార్థం ప్రత్యేక బస్సు నడుపాలని అలాగే మండలం లోని కాళేశ్వరం, పలుగుల, మద్దులపల్లి, మెట్టుపల్లి నుంచి వచ్చే విద్యార్థుల కోసం బొమ్మాపూర్ క్రాస్ రోడ్డు వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రోగులకు వైద్య సేవలు అందించాలి



జయశంకర్ భూపాలపల్లి : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. చిట్యాల కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపీ, ఇన్‌పేషెంట్ రిజిస్టర్, ల్యాబ్‌లో రక్త పరీక్షల పరికరాలు, శస్త్రచికిత్స గదులను ఆయన పరిశీలించి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు వైద్యసేవలపై నమ్మకం కలిగించాలని వివరించారు. ఆసుపత్రి చాలా బావుందని, రోజుకు ఎంత మంది ప్రజలు వైద్య సేవలకు వస్తున్నారని, రోజుకు ఎంతమంది వైద్యసేవలకు వస్తున్నారని అడుగగా 150 నుండి 200 మంది వరకు వస్తున్నారని ఓపి.సేవలు పెంచాలని వైద్యులను ఆదేశించారు. వైద్య సేవలకు ఎలాంటి వ్యాధితో బాధపడే వారు వస్తున్నారని వైద్యాదికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని అన్ని సమయాలలో వైద్య సేవలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సదుపాయాలు, వైద్య సేవలు మెరుగుగా ఉన్నాయని, ఎందుకు వైద్య సేవలకు ప్రజలు రావడం లేదని అన్నారు.

అయితే ఇంకా మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని సూచించారు. 24 గంటల పాటు సేవలు అందుబాటులో ఉండాలని, తప్పనిసరి వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించాలని తెలిపారు. అలాగే పాము, కుక్క కాటు వంటి ప్రమాదాల నివారణకు అవసరమైన మందులు, వ్యాక్సి అన్నివేళల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రసూతి, చిన్న పిల్లల వైద్యులు నియామకం కొరకు చర్యలు తీసుకుంటామని, మీ మిత్రులు కానీ మీకు తెలిసిన వైద్యులు ఉంటే నియామకానికి చర్యలు తీసుకుంటామని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వాలియా నాయక్, డా శ్రీకాంత్, తహసీల్దార్ ఇమామ్ బాషా తదితరులు. పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో ఐదుగురి ప్రాణాలు కాపాడిన అధికారులు

**ఖమ్మం,తెలంగాణ దిశ:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అధికారులు ఐదుగురి ప్రాణాలు కాపాడారు. చింతకాని మండలం చిన్న మండవ మున్నేరు వరదలో ఐదుగురు చిక్కుకున్నారు. కుల గణన సర్వే ప్రెజెంటేషన్ పని పై ఢిల్లీలో ఉన్న ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో వెంటనే స్పందించిన రెవి న్యూ, పోలీస్ అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించారు. గేదెలు మేపుకునేదుకు వెళ్లి అకస్మాత్తుగా పెరిగిన వరదలో చిక్కున్న వారిని ఎన్డీఆర్ఎఫ్ సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. ఐదుగురు సురక్షి తంగా ఒడ్డుకు చేరడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేసారు.

# బీజేపీకి జగన్ జై కొడతారా..




విజయవాడ, : వైసీపీ అధినేత జగన్ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కొంత సానుకూలతతోనే ఉన్నట్లు తెలుగుదేశం పార్టీ నేతలు అనుమానిస్తున్నారు. వైఎస్ గన్ ఢిల్లీకి వెళ్లకపోయినా ఆయన ఇక్కడి నుంచి పార్టీ అగ్రనేతలతో టచ్ లో ఉన్నారన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కూడా సాఫ్ట్ కార్నర్ గానే వ్యవహరిస్తున్నారని, అదే సమయంలో బీజేపీ పై జగన్ పార్టీ పెద్దగా విమర్శలు చేయకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. గతంలో తాము వ్యతిరేకించినప్పుడు ఏపీలో పర్యటించినప్పుడల్లా చంద్రబాబుపైనా, తెలుగుదేశం పాలనపైన విమర్శలు చేసే ప్రధాని నరేంద్ర మోదీ సయితం ఈసారి జగన్ విషయాన్ని ప్రస్తావించకపోవడాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న తమను కాదని, జగన్ ను కూడా చంకన పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానం వారిలో బలపడుతుంది.... ఇటీవల వరసగా రెండు సార్లు ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటనకు వచ్చారు. అమరావతి రాజధాని రీలాంచింగ్ పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు జగన్ ప్రస్తావన లేకుండా తన ప్రసంగంలో జాగ్రత్త పడ్డారనిపిస్తుంది. అదే సమయంలో చంద్రబాబు నాయుడును, పవన్ కల్యాణ్, లోకేశ్ లను పొడిగినప్పటికీ జగన్ ను విమర్శించకపోవడాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అలాగే విశాఖకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత రెండుసార్లు ప్రధాని మోదీ వచ్చినప్పటికీ బహిరంగ సభలో జగన్ ప్రస్తావన తేవకపోవడాన్ని తప్పుపడుతున్నారు. గత ప్రభుత్వం వైఫల్యం కారణంగానే అని పాసింగ్ రిమార్క్ చేశారు తప్పించి జగన్ అవినీతిపై పెద్దగా మాట్లాడలేదని తెలుగుతమ్ముళ్లు కొంత అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. కేటాయించనున్నారా? ఏదో జరుగుతుందని... ఇక జగన్ కేసుల్లో కూడా ఎలాంటి పురోగతి లేకపోవడాన్ని కూడా వారు ఏదో జరుగుతుందన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. జగన్ పై 2014లో నమోదయిన అనేక కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా జరగడం లేదు. న్యాయస్థానాల్లో అనేక కేసులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి. వాటిపై అతీ గతీ లేదని అంటున్నారు. ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ ఎలాంటి పురోగతి లేదు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా సీబీఐ కేసును సరిగా దర్యాప్తు చేయకపోయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి తెలుగుదేశం పార్టీ నేతల్లో ఉంది. ఈ కేసుల్లో అనుమానితులైన వారు బెయిల్ పై ఉండటాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. . ఇక చిన్న విషయమూ బయటకు వచ్చినా వెంటనే స్పందించే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు మద్యం కుంభకోణం కేసులో ముందడుగు వేయడం లేదన్న ఉక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. తాజాగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా మద్యం కుంభకోణం కేసును ఈడీ సీరియస్ గా తీసుకోకపోవడాన్ని తప్పుపట్టారు. చిన్నా చితకా కేసుల్లో హడావిడి చేసే ఈడీ అధికారులు దాదాపు 3,200 కోట్ల రూపాయల కుంభకోణంపై ఎందుకు స్పందిచండం లేదని ప్రశ్నించారు. కేవలం నిందితులను విచారించి వదిలేశారన్న విమర్శలు టీడీపీ నుంచి బహిరంగంగా వినిపిస్తున్నాయి. దీంతో ఢిల్లీ స్థాయి కమలం నేతలపై అనుమాన బీజం సైకిల్ పార్టీ నేతల్లో బయలుదేరిందనుకోవాలి. ఆ అనుమానం పెరిగి పెద్దది కాకముందే బీజేపీ తగిన చర్యలకు ఉపక్రమించాలని నేతలు కోరుతున్నారు.

# అరెస్ట్ కు కూత దూరంలో మంత్రులు

విజయవాడ, : వైసీపీ నేతలు ఒక్కొక్కరు జైలు పాలు అవుతున్నారు. వారువీరు అన్న తేడా లేకుండా అందరి చుట్టూ ఉచ్చు బిగించి మరి లోపల వేయిస్తోంది కూటమి ప్రభుత్వం. తాజాగా జాబితాలో మాజీ మంత్రుల పేర్లు ఉన్నాయి. ప్రముఖంగా ఆర్కే రోజాతో పాటు అనిల్ కుమార్ యాదవ్ పేరు వినిపిస్తోంది. ఈ ఇద్దరు నేతలు వైయస్సార్సీపి హయాంలో ప్రత్యర్థుల విషయంలో దారుణంగా వ్యవహరించారు. అయితే ఇప్పటికే మద్యం కుంభకోణం కేసులో ఓ 12 మంది అరెస్టు అయ్యారు. ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్ట్ తో సంచలనంగా మారింది. మరోవైపు జగన్మోహన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే అంతకంటే ముందే మాజీ మంత్రులు ఆర్కే రోజాతో పాటు అనిల్ కుమార్యాదవ్ను అరెస్టు చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. మంత్రులుగా ఉండే సమయంలో భారీ అవినీతి కి పాల్పడ్డారన్న ఆరోపణలు వీరిపై ఉన్నాయి. వాటిని బయటకు తీసి ఇద్దరినీ అరెస్ట్ చేస్తారని తెలుస్తోంది. మిధున్ రెడ్డి తర్వాత అరెస్టు ఈ ఇద్దరిదేనని పెద్ద ఎత్తున ప్రచారం మాత్రం జరుగుతోంది. ఇప్పటికే నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. క్వార్జ్ కుంభకోణానికి సంబంధించి ఆయనను అరెస్టు చేశారు. అదే కేసులో శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి సైతం అరెస్టయ్యారు. అయితే విచారణ సందర్భంగా ఆయన ఆసక్తికర విషయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. నెల్లూరులోని ప్రధాన ప్రాంతాల్లో వేలకోట్ల రూపాయలకు సంబంధించి భూములు కొనుగోలు చేసినట్లు.. అందులో అక్రమ మైనింగ్ పాల్పడినట్లు.. ఇందులో గోవర్ధన్ రెడ్డి తో పాటు అనిల్ కుమార్ యాదవ్ కి కూడా సంబంధం ఉందని విచారణలో ఆయన వెల్లడించినట్లు తెలుస్తోంది. దీంతో అనిల్ కుమార్ యాదవ్ అరెస్ట్ కు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎప్పటికీ ఈ కుంభకోణానికి సంబంధించి పలుమార్లు అనిల్ కుమార్ యాదవ్ నెల్లూరు వచ్చి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇది కక్షపూరిత చర్యగా అభివర్ణిస్తూ.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై విమర్శలు చేశారు. అయితే తాజాగా శ్రీకాంత్ రెడ్డి ఇచ్చిన సమాచారంతో అనిల్ కుమార్ యాదవ్ పై చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అనిల్ కుమార్ యాదవ్ ఏపీకి అందుబాటులో ఉండడం చాలా తక్కువ. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే గా ఉండగా ఆయనకు మంత్రి పదవి లభించింది. మొన్నటి ఎన్నికల్లో వ్యతిరేకత ఉందని చెప్పి ఆయనను నరసరావుపేట ఎంపీ సీటుకు పంపించారు. అక్కడ టిడిపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు చేతిలో ఓడిపోయారు అనిల్ కుమార్ యాదవ్. అయితే ఓడిపోయిన నాటి నుంచి ఎక్కడా కనిపించడం లేదు. నరసరావుపేట వైపు చూడడం లేదు. అలాగని నెల్లూరు సిటీ బాధ్యతలను వేరే నేతకు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. ఈ తరుణంలో ఇతర రాష్ట్రాల్లో సొంత వ్యాపారాల్లో బిజీగా ఉన్నారు అనిల్ కుమార్ యాదవ్. ఇటువంటి తరుణంలో నెల్లూరు మైనింగ్ కుంభకోణంలో ఆయన పేరు బయటకు వచ్చింది. దీంతో అరెస్టుకు అంతా రంగం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మాజీ మంత్రి రోజా అరెస్టు తప్పదని తెగ ప్రచారం నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉండేవారు. ఆడుదాం ఆంధ్ర తో పాటు సీఎం కప్ పోటీల్లో భారీగా అవినీతి జరిగిందని ఆరోపణలు వినిపించాయి. దీనిపై సీనియర్ క్రీడాకారులతో పాటు క్రీడా సంఘాల ప్రతినిధులు కూడా ఫిర్యాదులు చేశారు. దీంతో అన్ని జిల్లాల నుంచి సమాచారం సేకరించింది ఏపీ ప్రభుత్వం. ఇందులో 100 కోట్ల రూపాయల వరకు అవినీతి జరిగిందని గుర్తించింది. దీనిని బాధ్యులు చేస్తూ అప్పటి మంత్రి రోజాతో పాటు ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాస్ పై కేసు నమోదు చేసేందుకు సిద్ధపడుతోంది. ఈ కేసులో రోజా అరెస్టు తప్పదని తెలుస్తోంది. ఈ ఇద్దరు మాజీ మంత్రుల అరెస్టుతో వైసీపీలో ఒక రకమైన చేంజ్ కనిపించే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం రెండు కాళ్లు నరుక్కున్న డాక్టర్!



ఇన్సూరెన్స్ డబ్బుల కోసం మర్డర్లు చేసిన ఘటనలు ఇప్పటివరకు చాలానే చూశాం. కానీ ఇది దీనికి చాలా భిన్నమనే చెప్పొచ్చు. కానీ బ్రిటన్‌కు చెందిన ఓ డాక్టర్ బీమా డబ్బుల కోసం కక్కుర్తి పడి ఏకంగా తన రెండు కాళ్లను నరికేసుకున్నాడు. ప్రాణాలకు హానీ కలకుండా కాళ్లను ఎలా తొలగించుకోవడం ఎలా అని ఆన్‌లైన్‌లో వీడియోలు చూసి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం గమనార్హం. అయితే సదరు వ్యక్తి తీరుపై అనుమానం వచ్చిన ఇన్సూరెన్స్ కంపెనీలు కోర్టుకు ఎక్కడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ఇంగ్లండ్ కార్న్‌వాల్‌లోని ట్రూరోకు చెందిన నేలీ హెూపర్ (49) ఓ డాక్టర్. సెప్సిస్ అనే రక్తనాళ సంబంధిత వ్యాధి కారణంగా మరో వైద్యుడి సహకారంతో రెండు కాళ్లను మోకాళ్ల వరకు తొలగించుకున్నాడు. అనంతరం దాదాపు ఐదు లక్షల పౌండ్లు ( రూ. 5.6 కోట్లు) ఇన్సూరెన్స్ క్లెయిమ్ పొందేందుకు రెండు సంస్థలను ఆశ్రయించాడు. అయితే ముందుగా తమకు సమాచారం ఇవ్వకుండా.. కాళ్లు తొలగించుకున్న తర్వాత సమాచారం ఇవ్వడంతో సదరు బీమా కంపెనీలకు అనుమానం వచ్చింది. దీంతో అతను క్లెయిమ్‌ను పక్కన పెట్టేశాయి. నేలీ హెూపర్ కావాలనే డబ్బుల కోసం కాళ్లు తొలగించుకున్నాడని బీమా కంపెనీలు కోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలోనే షాకింగ్ విషయాలు బయటకొచ్చాయి. శరీరానికి హానీ కలకుండా మోకాళ్లను తొలగించుకోవడం ఎలా అని తెలుసుకునేందుకు పలు వెబ్‌సైట్ల నుంచి 2018 ఆగస్టు 21వ తేదీ నుంచి 2020 డిసెంబర్ 4 వ తేదీ వరకు వీడియోలను నేలీ హెూపర్ కొనుగోలు చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా ఇలా కాళ్లను తొలగించాలని మారియస్ గుత్సావ్‌సన్ అనే వైద్యుడిని నెయిల్ హెూపర్ ప్రోత్సహించారనే అభియోగాలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో 2023 మార్చిలో హెూపర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అతను పనిచేస్తున్న రాయల్ కార్న్‌వాల్ హాస్పిటల్స్ ఎన్‌హెచ్‌టీ ట్రస్ట్ విధుల్లో నుంచి తొలగించింది. అదే ఏడాది డిసెంబర్‌లో మెడికల్ రిజిస్టర్ నుంచి అతని పేరును కూడా తొలగించారు. కాగా, వృత్తిపరంగా హెూపర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవని, అతని వల్ల రోగులకు కూడా ఎలాంటి ఇబ్బందులు రాలేవని రాయల్ కార్న్‌వాల్ హాస్పిటల్ యాజమాన్యం చెప్పింది. అయినప్పటికీ అతన్ని విధుల్లో నుంచి తొలగించామని, విచారణకు సహకరిస్తామని తెలిపింది. కాగా, సెప్సిస్ అనే రక్తనాళ సంబంధిత వ్యాధి కారణంగానే తాను కాళ్లను తొలగించుకోవాల్సి వచ్చిందని బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో నెయిల్ హెూపర్ తెలిపారు. నిపుణుల సూచన మేరకు ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కాళ్లు ఉన్నప్పటి కంటే కూడా కాళ్లు లేకుండానే తాను యాక్టివ్‌గా ఉన్నానని పేర్కొన్నారు. తాజాగా హెూపర్‌కు సంబంధించిన కేసు మెజిస్ట్రేట్ కోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసులో వాదాపోవాదనలు విన్న న్యాయమూర్తి అతన్ని దోషిగా నిర్ధారించి.. కస్టడీకి పంపించింది. ఆగస్టు 26వ తేదీన ట్రూరో క్రౌన్ కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది.

# నగరంలో 218 రకాల పక్షులు



## గుర్తించిన హైదరాబాద్ బర్డ్ అట్లాస్ సంస్థ

హైదరాబాద్ : నగర పర్యావరణ పరిరక్షణలో భాగంగా పక్షుల జీవ వైవిధ్య పరిస్థితులు, వాటి సంఖ్యను తెలుసుకునేందుకు హైదరాబాద్ బర్డ్స్ అట్లాస్(హెచ్‌బీఏ) సర్వే నిర్వహించగా సిటీ మొత్తంలో 218 రకాలకు చెందిన 1,36,000 లక్షల పక్షులు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఉన్న పక్షులను గుర్తించేందుకు హెచ్‌బీఏ సంస్థ 2025లో రెండు సీజన్లలో సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా ఫిబ్రవరిలో జరిగిన మొదటి సీజన్‌లో 209 మంది వలంటీర్లు నగరవ్యాప్తంగా 180 ప్రదేశాల్లో పక్షుల గణన చేపట్టారు. వారు చేపట్టిన సర్వేలో 195 రకాలకు చెందిన 79,187 పక్షులు ఉన్నట్లు గుర్తించారు. తరువాత జూన్ నెలలో రెండో సీజన్‌లో చేపట్టిన సర్వేలో 225మంది వలంటీర్లు 166 రకాలకు చెందిన 62,811 పక్షులను గుర్తించారు. మొదటి సర్వేలో నగరంలోని చెరువులు, అటవీ ప్రాంతాలు, పచ్చదనం ప్రాంతాల్లో వలస పక్షులు అధికంగా కనిపించగా, రెండో సర్వేలో మాత్రం వలస పక్షులు లేకపోవడం మూలంగా పక్షుల సంఖ్య తగ్గటం గమనార్హం. బ్రీడింగ్, గూడ్ల నిర్మాణం వాతావరణ మార్పుల వంటి కీలక అంశాలపై సమాచారం సేకరించినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రెండో సీజన్‌లో అశీ ప్రినియా, రెడ్ వెంటెడ్ బల్బుల్, స్పొటెడ్ డొవ్, రాక్ పిజన్, ఏషియన్ కోయిల్ పక్షులు అధికంగా కనిపించగా, బయా వీవర్, హౌస్ క్రో, స్కేలీ బ్రెస్టెడ్ మునియా, ఈస్టర్న్ క్యాటిల్ ఇగ్రెట్ వంటి రకాలకు చెందిన పక్షులు ఉండటం గమనార్హం. ఇందులో డెక్కన్ బర్డర్స్, ఇండియా డబ్ల్యుడబ్ల్యుఎఫ్ వారి భాగస్వామ్యం ఉండటం విశేషం. ఈ సర్వే మరో రెండేళ్లపాటు కొనసాగునందని నిర్వాహకులు తెలిపారు.

# కల్లలవుతున్న డాలర్ డ్రీమ్స్

హైదరాబాద్, : డాలర్ డ్రీమ్ ఎంతో మంది భారతీయులను అమెరికా బాట పట్టించింది. లక్షల మంది ప్రస్తుతం అమెరికాలో ఉన్నత చదువులు చదివి అక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు. ఆరు నెలల క్రితం వరకు వీరి జీవితం సాఫీగా సాగిపోతూ వచ్చింది. కానీ, డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడైతే అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టారో.. మరుక్షణం నుంచి అమెరికాలో ఉంటున్న భారతీయులతోపాటు విదేశీయులకు ఇబ్బందులు మొదలయ్యాయి. అక్రమంగా ఉంటున్నారని వేల మందిని గుర్తించి స్వదేశాలకు పంపించింది. వీసాలపై ఆంక్షలు పెట్టింది. సోషల్ మీడియాపై ఆంక్షలు విధించింది. పాలస్తీనాకు మద్దతు తెలిపేవారి వీసాలు రద్దు చేసింది. మొత్తంగా ట్రంప్ రాక.. అమెరికాలోని విదేశీయుల డాలర్ కలను చెరిపేస్తోంది. తాజాగా హెచ్ 1బీ వీసాల ఎక్స్‌టెన్షన్ కోసం కూడా పడరాని పాట్లు పడుతున్నారు. యూఎస్‌సీఐఎస్ నిబంధనల ప్రకారం.. 240 రోజుల తర్వాత హెచ్ 1బీ వీసా అనుమతి ఆగిపోతుంది. ఇది కార్మికులను ఆర్థిక, మానసిక ఒత్తిడిలోకి నెట్టింది. హెచ్ 1బీ వీసాగరిష్టంగాఆరేళ్లు చెల్లుబాటవుతు8ంది. అయితే పీఈఆర్ఎం అప్లికేషన్ ఏడాదిగా పెండింగ్‌లో ఉంటే ఆ ఉద్యోగులు ఎక్స్‌టెన్షన్‌కు అర్హులవుతారు. కానీ ఎక్స్‌టెన్షన్ దరఖాస్తు సమర్పించిన తర్వాత 240 రోజుల తర్వాత యూఎస్‌సీఐఎస్ నిబంధనల ప్రకారం.. పని చేయడం ఆపేయాలి. అయితే దేశంలో ఉండొచ్చు. ఈ నిబంధన కార్మికులకు ఇబ్బందిగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు మొదలవుతున్నాయి. రెన్యూవల్‌లో జాప్యం, స్పష్టత లేకపోవడం ఖాళీగా ఉండేని పరిస్థితి తీసుకొస్తుంది. ఆదాయం లేక నష్టపోవడమే కాకుండా మానసిక ఒత్తిడితో పోరాడుతున్నారు. అమెరికాలో స్థిరపడి, పన్నులు చెల్లిస్తూ, చట్టాలను పాటిస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ ఖాళీగా ఉండడం కెరీర్‌ను స్తంభింపజేస్తుంది. వీసా రెన్యువల్‌కు అనుమతి పొంది 365 రోజులు దాటిన తర్వాత ఐ?140 దరఖాస్తు కార్మికులు ప్రీమియం ప్రాసెసింగ్ ద్వారా వేగంగా ఎక్స్‌టెన్షన్ పొందే అవకాశం ఉంటుంది. కానీ, ఈ సమయంలోనూ పనిలేకుండా ఉండాల్సిందే. ఇది ఆర్థికంగా ప్రీమియం ప్రాసెసింగ్ అందుబాటులోకి వచ్చే వరకు ఎటువంటి ఉపశమనం లేదు. ప్రయాణం చేయవద్దు, పని చేయవద్దు, ఎటువంటి రిస్క్ తీసుకోవద్దు. గ్రేస్ పీరియడ్ లేకపోవడం కార్మికులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టివేస్తోంది.

# రాజాసింగ్ రిటర్న్స్



హైదరాబాద్ : గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాపై పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. ఇందుకు కారణం రాజాసింగ్ కూడా కూడా వెనక్కుతగ్గడమే కారణమని సమాచారం. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో పార్టీ కేంద్ర నాయకత్వం ఈ నెల 11వ తేదీన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తర్వాత రాజాసింగ్ మాత్రం తాను ఏ పార్టీలో చేరనని, తాను మోదీ, అమిత్ షాలకు వీర విధేయుడినని ప్రకటించుకున్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమన్నా తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని రాజాసింగ్ తెలిపారు. అదే సమయంలో గోషామహల్ బీజేపీకి అడ్డా అని, ఇక్కడ ఎవరు పోటీ చేసినా విజయం ఖాయమని ఆయన అన్నారు. మరొక వైపు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించిన నాయకత్వం ఆయన ఎమ్మెల్యే పదవి విషయంలో మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. సహజంగా పార్టీకి రాజీనామా ఆమోదించిన తర్వాత పార్టీ నాయకత్వం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కు ఈ విషయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. పార్టీ బీఫారం పై పోటీ చేసి గెలుపొందిన రాజాసింగ్ ను స్పీకర్ ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసే అవకాశముంటుంది. కానీ బీజేపీ నాయకత్వం మాత్రం రాజీనామాను ఆమోదించి దాదాపు పన్నెండు రోజులవుతున్నా స్పీకర్ కు లేఖ రాయకపోవడంతో తిరిగి రాజీనామాపై ఆలోచన చేస్తుందని చెబుతున్నారు. రాజాసింగ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు పక్కా హిందుత్వ వాదిగా ముద్రపడటంతో ఆయనను బయటకు పంపించే ప్రయత్నాన్ని విరమించకుందని చెబుతున్నారు. దీనికి తోడు రాజాసింగ్ కూడా బీజేపీ తన రాజీనామా ఆమోదించిన తర్వాత చాలా తగ్గినట్లు కనిపిస్తుంది. రాజీనామా ఆమోదించిన తర్వాత ఎలాంటి పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేయకపోవడంతో పాటు తాను మోదీ, షాలకు విధేయుడినని ప్రకటించుకోవడం కూడా మళ్లీ బీజేపీలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అర్థమవుతుంది. దీనికి తోడు తాజాగా నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ చేసిన కామెంట్స్ కూడా ఇందుకు ఊతమిస్తున్నాయి. రాజా భాయ్ ఎక్కడున్నా గౌరవిస్తామని అరవింద్ అన్నారు. ఆయన సస్పెండ్ కాలేదు పార్టీకి రాజీనామా మాత్రమే చేశారన్న అరవింద్, పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం తీసుకోవచ్చని కూడా తెలిపారు. కొన్ని విషయాల్లో మనస్తాపం చెంది రాజా భాయ్ రాజీనామా చేశారని ధర్మపురి అరవింద్ అనడం కూడా రాజాభాయ్ రిటర్న్ అవుతారన్న టాక్ వినిపిస్తుంది.

## ఫారెస్ట్ ఆఫీసర్ ఇంట్లో తనిఖీలు..

# 1.4 కోట్ల నగదు, గోల్డ్ బిస్కెట్లు సీజ్



కోరాపుట్: ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఉన్న జేయ్‌పోర్ డిప్యూటీ రేంజర్ రామ చంద్ర నేపాక్ ఇండ్లపై ఇవాళ విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. ఆ తనిఖీల్లో ఆ ఆఫీసర్ ఇంట్లో సుమారు 1.4 కోట్ల నగదు దొరికింది. అతని అపార్ట్‌మెంట్‌లోని ఓ రహస్య ట్రెజరీలో ఆ నగదును దాచాడతను. ఫారెస్ట్ ఆఫీసర్ రామచంద్ర నుంచి నగదుతో పాటు నాలుగు బంగారు బిస్కెట్లు, 16 బంగారు నాణాలు రికవరీ చేశారు. మొత్తం ఆరు ప్రదేశాల్లో ఇవాళ ఒడిశా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులను సంపాదించినట్లు ఆ ఆఫీసర్‌పై ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్ శాఖ స్పెషల్ జడ్జి ఇచ్చిన సెర్చ్ వారెంట్‌తో అధికారులు ఆ ఆఫీసర్ ఇండ్లల్లో తనిఖీలు చేశారు. ఆరుగురు డీఎస్పీలు, అయిదుగురు ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది ఈ సోదాల్లో పాల్గొన్నారు. అన్ని చోట్ల నుంచి సుమారు 1.4 కోట్ల నగదును సీజ్ చేశారు. ప్రస్తుతం ఇంకా తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. సోదాలు ముగిసిన తర్వాత సమగ్రమైన ఇన్ఫర్మేషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. జేయ్‌పోర్ పట్టణంలోని గోల్డెన్ హైట్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ లో ఉన్న ఫ్లాట్ నెంబర్ 510లోని ఓ సీక్రెట్ లాకర్‌లో 1.4 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఒడిశా విజిలెన్స్ అధికారులు చెప్పారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు మూసివేత

విజయవాడ : ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. విజయ వాడలో భారీ వర్షాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్‌ను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు.

రోడ్డు మీద ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున భద్రతా పరంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. భక్తుల వాహనాలను కనకదుర్గ నగర్ వైపు మళ్లిస్తున్నారు. ఈ మేరకు భక్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలతో

# ప్రజలను మోసం చేసింది

## బిజెపి జిల్లా కార్యదర్శి ఉప్పు రామకృష్ణ వ్యాఖ్యలు

**- అధికారం కోసం అడ్డగోలు హామీలి చ్చిన కాంగ్రెస్ , ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైంది**

**- జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందడానికి కాంగ్రెస్ పడరాని పాట్లు పడుతుంది**

**- కాంగ్రెస్ ఎన్ని మాయమాటలు చెప్పిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదు**

**- జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటి చెబుతాం కాషాయ జెండా ఎగరవేస్తాం**

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ లోగడ ఎన్నికల సందర్భంగా అధికారం లోకి రావడం కోసం 6 గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందని, ఆహామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని, నేడు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడరాని పాట్లు పడుతుందని, ప్రజలను మళ్లీ మోసం చేయడానికి కొత్త రాజకీయ డ్రామాలుమొదలు పెట్టిందని ,బిజెపి జిల్లా కార్యదర్శి ఉప్పు రామకృష్ణ అన్నారు బిజెపి కొత్తపల్లి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలోస్థానిక సంస్థల ఎన్నికల కార్యాశాల సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆరు గ్యారంటీలతో, 420 హామీలతో ప్రజలను ఆదుకుంటామని కాంగ్రెస్ మాయమాటలు, అబద్ధాలు చెప్పి ప్రజానీకాన్ని మోసం చేసిందన్నారు. పథకాల అమలు కోసం దాదాపు రెండేళ్ల కాలంగా కాంగ్రెస్ సర్కార్ ప్రజా పాలన పేరిట ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి చేతులు దులుపుకోవడం తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. అరకోర పథకాలను అమలు చేస్తూ , ఇష్యూ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటి సక్రమంగా అమలైంది తప్ప, మిగతా ఏ ఒక్కటీ అమలు కాలేదని ఆయన ఆరోపించారు. రైతు రుణమాఫీ అరకోర చేసిందని, పింఛన్లు అందించడం లేదని, నిరుద్యోగ భృతిని అటకెక్కించిందని , ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ చెప్పిన లెక్కలేనన్ని హామీలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీవన్నీ ఉద్దెర ముచ్చట్లనే విషయం ప్రజలందరికీ అర్థమైందని,మాటల గారడితో ప్రజలను మోసగించడం కాంగ్రెస్కే చెల్లిందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసానికి ప్రతిఫలం లభించిందని,అందుకే లోగోడ జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి ఉద్యోగులు, పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ప్రస్తుతం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం మళ్లీ కాంగ్రెస్ సర్కార్ లబ్ధి పొందడానికి కుటిలప్రయత్నాలు, రాజకీయాలు మొదలు పెట్టిందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంతో రాజకీయనాటకాలు మొదలుపెట్టిందని ఆయన విమర్శించారు. 10% రిజర్వేషన్లు ముస్లింలకు వర్తించే విధంగా బీసీ రిజర్వేషన్ ను చేపట్టిందన్నారు. దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. జరగబోయే జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు దిమ్మదిరిగే ఫలితాలు అందిస్తారని ఆయన జోస్యం చెప్పారు. కాంగ్రెస్ఎన్ని కుట్రలు కుతం త్రాలు చేసిన , ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి జరగబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం లభిస్తుంద న్నారు. ప్రజలంతా బిజెపి మోదీ కేంద్ర ప్రభుత్వ పనితీరుపై విశ్వాసంతో ఉన్నారన్నారు.గ్రామాల్లో మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతుందనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. అందుకే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నిక ల్లో బిజెపి సత్తా చాటేలా తగిన కార్యాచరణలతో ముందుకు కొనసా గడం జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మండల శాఖ అధ్యక్షులు కుంట తిరుపతి నాయకులు జవ్వాజీ రమేష్ కడార్ల రతన్ కుమార్ వేముల అనిల్ కుమార్ కోమటిరెడ్డి అంజన్ కుమార్ సోమినేని కరుణాకర్ గుడిసెల రంజిత్ పోర్తి అనిల్ వివిధ మోర్చాలఅధ్యక్షులు,నాయకులు,శక్తి కేంద్రం ఇంఛార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## నిందితులను పట్టుకోవడంలో పోలీస్ జాగిలాల పాత్ర కీలకం

### ఎస్పీ మహేష్ బి గీతే



సిరిసిల్ల : నేర పరిశోధన, భద్రతా చర్యలు, మాదకద్రవ్యాల నియంత్రణ, విపత్తు పరిస్థితుల్లో పోలీస్ జాగిలాల కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. శిక్షణా సామర్థ్యం వల్ల విభిన్న ఆపరేషన్లలో వీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. పోలీస్ జగిలాల సంరక్షణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాటి కోసం నూతనంగా నిర్మించిన గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విశ్వాసానికి మారు పేరుగా నిలిచే జాగిలాలు పోలీస్ శాఖకు నేర పరిశోధనలో కీలకంగా మారుతున్నాయ పేర్కొన్నారు. హత్యలు, దోపిడీలు, దొంగతనాలు జరిగిన సమయంలో నిందితులను పట్టించడం, సంఘ విద్రోహులు అమర్చే పేలుడు పదార్థాలను గుర్తించి భారీ ప్రాణ, ఆస్తి నష్టం నివారించడంలో పోలీసు జాగిలాలు అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నాయని వెల్లడించారు. మాదకద్రవ్యాలు , బాంబులు, ఇతర అనుమానాస్పద వస్తువులను గుర్తించడంలో ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. జిల్లాలో అనేక కేసులను ఛేదించడంలో, ఆధారాల సేకరణలో వీటి పనితీరు ప్రశంసనీయమైనది అని అన్నారు. పోలీస్ జాగిలాలకు అధునాతన శిక్షణ, వైద్య సంరక్షణ, తగిన సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు జగిలాలు ఉన్నాయని, వీటి నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన హ్యాండ్లర్స్ ఉన్నారని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, నటేష్,ఆర్.ఐలు రమేష్, యాదగిరి, ఎస్సైలు, ఆర్ఎస్సైలు , డాగ్స్ హ్యాండ్లర్స్ కార్తీక్,సురేష్, శ్రీనివాస్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# అంబటి స్థానంలో మోదుగుల



గుంటూరు,: గుంటూరు జిల్లా వైసీపీలో కీలక మార్పులు చేయాలని అధిష్టానం భావిస్తోందంట.. రాజధాని ప్రాంతంలోని కీలకమైన జిల్లాలో మూడు రాజధానుల ప్రతిపాదనతో వైసీపీకి చావుదెబ్బ తగిలింది. తిరిగి జిల్లాలో తమ ఉనికి కాపాడుకోవాలంటే పార్టీలో సమూల మార్పులు చేయాలని జగన్ ఫిక్స్ అయ్యారంట. సామాజివర్గాలవారీగా తమకు కీలకమైన సామాజివర్గానికి చెందిన రెడ్డి నేతకు మళ్లీ కీలక బాధ్యతలు అప్పజెప్పే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గుంటూరు జిల్లా బాధ్యతలకు సంబంధించి జగన్ దృష్టిలో ఉంది ఎవరు? గత ఎన్నికల్లో వైసీపీకి దూరం జరిగిన రెడ్డి సామాజికవర్గం. గుంటూరు జిల్లా జిల్లాలో రాజకీయాలు ఎప్పుడు రసవత్తరంగానే సాగుతుంటాయి. ఇటు అధికారపక్షమైనా అటు ప్రతిపక్షమైనా అక్కడ చక్రం తిప్పడానికి ఏదో ఒక కీలకమైన నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటాయి.. ప్రస్తుతం గుంటూరు జిల్లా వైసీపీలో కూడా కీలకమైనటు వంటి మార్పు జరగబోతుందని ప్రచారం జరుగుతోంది. వైసీపీకి అత్యంత కీలకమైనటువంటి ఓటు బ్యాంకుగా ఉన్న రెడ్డి సామాజ వర్గం మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీకి హ్యాండ్ ఇచ్చిందన్న అభిప్రాయం ఉంది. ఆ క్రమంలో సొంత సామాజికవర్గాన్ని తిరిగి దగ్గర చేసుకోవడానికి జగన్ రెడ్డి తన వర్గం నేతను మళ్లీ అత్యంత కీలకమైనటువంటి పదవిలోకి తీసుకొని రావాలని భావిస్తున్నారంట. పల్నాడు ప్రాంతంలో యాక్టివ్‌గా లేని వైసీపీ రెడ్డి వర్గం నేతలు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముఖ్యంగా పల్నాడు జిల్లాలో రెడ్డి సామాజికవర్గం ప్రాబల్యం ఉంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత జిల్లాలోని రెడ్డి వర్గం నేతలెవరూ యాక్టివ్‌గా లేరు. వారు అప్పుడప్పుడు జనంలోకి వస్తున్నా ఆశించిన ఆదరణ దక్కడం లేదంటున్నారు. పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా జగన్ ఏరికోరి నియమించుకున్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కేసుల ఎఫెక్ట్‌లో మాచర్లలోనే పెద్దగా కనిపించడం లేదు. దాంతో ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు వైసీపీకి దూరమయ్యే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అది దృష్టికి రావడంతో ప్రస్తుతం రెడ్డి సామాజివర్గాన్ని మళ్లీ గుంటూరు జిల్లాలో యాక్టివ్ చేయాలని జగన్ ఆలోచిస్తున్నారంట. గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న అంబటి రాంబాబు. గుంటూరు జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి, కాపు సామాజిక వర్గానికి చెందిన అంబటి రాంబాబు కొనసాగుతున్నారు. ఆయనకి జగన్ ఇటీవలే గుంటూరు వెస్ట్ నియోజవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో పరాజయం పాలై గుంటూరు జిల్లాకు వచ్చిన అంబటి కూడా గుంటూరు వెస్ట్ బాధ్యతలు ఆశించారు. దాంతో ప్రస్తుతానికి గుంటూరు జిల్లాలో రెడ్డి సామాజి వర్గాన్ని యాక్టివ్ చేయాలంటే జిల్లా అధ్యక్షుడ్ని మార్పు చేయడం ఒక్కటే మార్గమని జగన్ భావిస్తున్నారంట. మోదుగుల వేణుగోపాల్‌రెడ్డికి జిల్లా పార్టీ పగ్గాలు? రెడ్డి సామాజిక వర్గానికి గుంటూరు జిల్లా ఇన్చార్జి పదవి కట్టబెట్టే ఆలోచనలో భాగంగా గుంటూరు జిల్లాలో కీలక నేతగా ఉన్న మోదుగుల వేణుగోపాల్ రెడ్డికి పగ్గాలు ఇవ్వాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. మోదుగుల వేణుగోపాల్ రెడ్డికి గత కొంతకాలంగా ఎలాంటి పదవులు లేకపోవడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయంటున్నారు. ఆయన నరసరావుపేట పార్లమెంటు ఇంచార్జిగా వెళ్తారు అనే ప్రచారం జరిగింది .ఆ తర్వాత సత్తెనపల్లి బాధ్యతలు మోదుగులకు అప్పచెప్తారన్న టాక్ నడిచింది. అసంత?ప్తితో ఉన్న మోదుగుల వర్గం. అయితే వైసీపీ అధిష్టానం ఇంతవరకు మోదుగులు వేణుగోపాల్‌రెడ్డికి ఏ బాధ్యతలు కట్టబెట్టలేదు. గుంటూరు జిల్లాలో పార్టీ కార్యక్రమాలకు సంబంధించి అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న మోదుగుల వేణుగోపాల్ రెడ్డికి జిల్లాలో ఎలాంటి పదవి లేకపోవటంపై ఆయన వర్గం కూడా కొంత అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.. ఆ అసంతృప్తిని పోగొట్టడంతో పాటు గుంటూరు జిల్లాలో పార్టీని మరింత దూకుడుగా ముందుకు తీసుకెళ్లడానికి మోదుగులకు జిల్లా ఇన్చార్జ్ బాధ్యతలు కట్టబెట్టే ఆలోచన చేస్తున్నారంట. వైసీపీకి అత్యంత కీలకమైన రెడ్డి సామాజిక వర్గానికి గుంటూరు జిల్లా ఇన్చార్జి పదవి ఇస్తే తిరిగి ఆ వర్గం పార్టీలో యాక్టివ్ అవుతుందని పార్టీ పెద్దలు లెక్కలు వేసుకుంటున్నారంట. మరి చూడాలి ఏం జరుగుతుందో..

## స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ పార్టీ నాయకులు విజయం సాధించాలి

### జాడి బాలరెడ్డి

రామడుగు మండలం రుద్రారం, రంగసాయిపల్లి గ్రామాల ఎంపీటీసీ పరిధి దత్తాజిపేట, లక్ష్మీపూర్, కిష్టంపల్లి, వెంకట్రావు పల్లె ఎంపీటీసీ పరిధిలో శక్తి కేంద్ర ఇన్చార్జిలు కట్ట రవీందర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి బూత్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎన్నికల ప్రభారి జాడిబాలారెడ్డి మాజీ పార్టీ అధ్యక్షులు ఒంటెల కరుణాకర్ రెడ్డి, ఎంపిటిసి పరిధి ఇంచార్జి ఉప్పు శ్రీనివాస్ పటేల్ హాజరయ్యారు. జాడి బాల్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం శనరుద్ధం కావాలని గ్రామాల్లో బిజెపి పార్టీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు కైవాసం చేసుకోవాలని అన్నారు బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇప్పటివరకు గ్రామాల్లో అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు గ్రామాల్లో ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవడం వలన కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయాయని అన్నారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు మోసపోరక హామీలు అని అన్నారు మోడీ పథకాల వలన గ్రామాలకు నిధులు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతి రెడ్డి, బీజేయం ప్రధాన కార్యదర్శి దాయల్లా రాజుకుమార్, బూత్ అధ్యక్షులు కోటగిరి ప్రశాంత్, ఒరుగంటి మహేష్ దైవల తిరుపతి, మడికంటి శేఖర్, శ్యామ్,గుర్రం శ్రీనివాస్, ముదిగంటి బాపురెడ్డి సీనియర్ నాయకుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 8 మంది మంత్రులకు చెక్

## సీనియర్లకు అవకాశం



విజయవాడ, : మంత్రివర్గ విస్తరణ పైగత కొద్ది రోజులుగా అనేక రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే తాజాగా మరింత ఎక్కువయ్యాయి. మంత్రివర్గ ప్రక్షాళన ఖాయమని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 13 నెలలు పూర్తవుతోంది. మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు మదింపు జరుగుతోంది. పలువురు మంత్రులను హెచ్చరిస్తూ సీఎం ఎప్పటికప్పుడు పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. అయినా సరే చాలామంది తీరులో మార్పు రావడం లేదు. ఈ తరుణంలో మంత్రివర్గ ప్రక్షాళనకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఓటమి వర్గాల్లో మంత్రివర్గ విస్తరణ పై చర్చ సాగుతోంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న తరుణంలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా? మరికొంత సమయం వేచి చూస్తారా? అన్న చర్చ కూడా సాగింది. అయితే ఏపీ మంత్రివర్గ ప్రక్షాళనకు సంబంధించి ముహూర్తం ఫిక్స్ చేసినట్లు ప్రచారం ప్రారంభం అయ్యింది. ప్రస్తుతం ఏపీ మంత్రివర్గంలో 24 మంది మంత్రులు ఉన్నారు. జనసేననుంచి ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. అయితే చాలామంది మంత్రుల విషయంలో సీఎం అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. క్యాబినెట్లో మంత్రులుగా ఉన్న పదిమంది తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన వారే. అయితే వారి ఎంపిక సమయంలోనే కీలక సూచనలు చేశారు. అత్యవసరం అయితే మంత్రివర్గ విస్తరణ చేపడతామని.. ఆ సమయంలో పదవులు వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు సీఎం చంద్రబాబు. అందుకే ఇప్పుడు ఎనిమిది మంది మంత్రులకు ఉద్వాసన పలుకుతారని తాజాగా ప్రచారం ప్రారంభం అయ్యింది. మరోవైపు మెగా బ్రదర్ నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవడం తప్పనిసరి. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ నిర్ణయమే ఫైనల్. మరోవైపు ఇప్పుడున్న మంత్రి పదవికి తోడు మరో పదవి బిజెపి కి కేటాయిస్తారని ప్రచారం సాగుతోంది. ఒకవైపు మిత్రపక్షా లకు ప్రాధాన్యం పెంచుతూ.. పార్టీలో సీనియర్లను క్యాబినెట్లోకి తీసుకోవాలని చంద్రబాబు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15లోగా ప్రక్షాళన ఉంటుందని సమాచారం. అదే జరిగితే టిడిపిలో సీనియర్లు ఎవరెవరికి మంత్రి పదవులు దక్కుతాయి? బిజెపిలో ఛాన్స్ ఎవరికి అనే చర్చ ప్రారంభం అయింది. మరోవైపు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజును( మంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది. అదే జరిగితే రఘురామ కృష్ణంరాజు స్థానంలో సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని డిప్యూటీ స్పీకర్ చేస్తారని సమాచారం. జనసేన నుంచి మంత్రిగా ఉన్న కందుల దుర్గేష్‌ను తప్పించి కొణతాలరామకృష్ణకు అవకాశం ఇస్తారని తెలుస్తోంది.ఉత్తరాంధ్ర నుంచిముగ్గురు మంత్రులను తప్పించడం ఖాయమని తెలుస్తోంది. అదే జరిగితే పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, కళా వెంకట్రావులపేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాలకు చెందిన వాసంశెట్టి సుభాష్ ను తప్పించే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిని తప్పించి వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డిని క్యాబినెట్‌లోకి తీసుకుంటారని సమాచారం.రాయలసీమనుంచి సైతంచేర్పులు మార్పులుఉండే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఓ మంత్రిని తప్పించి ఆ స్థానంలో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు కిషోర్ కుమార్ రెడ్డికి ఛాన్స్ ఇస్తారని ప్రచారంసాగుతోంది. ఇకకృష్ణాజిల్లా నుంచిఒక మంత్రిపై వేటు వేస్తారని తెలుస్తోంది.అయితే సామాజిక,ప్రాంతీయసమీకరణలకు అనుగుణంగా తుది నిర్ణయాలు జరగనున్నాయి. అన్ని సమీకరణలను ప్రామాణికంగా తీసుకుని చేర్పులు మార్పులు ఉంటాయని సమాచారం. అయితే ఒకేసారి ఎనిమిది మంది మంత్రులను తప్పించడం పెను సంచలనమే.

# ఆంధ్రాలో అమ్మలకే... 1500

ఏలూరు, : న్నికల హామీలపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీని అమలు చేయడం ప్రారంభించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచింది. అటు తరువాత అన్న క్యాంటీన్లను తెరిచింది. గత ఏడాది దీపావళి నాడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించింది. అయితే ఆ మూడు చేసినా ప్రజల్లో సంతృప్తి కనిపించలేదు. ఆ మూడు హామీలు సూపర్ సిక్స్ పథకంలో ఉన్నవే. అయితే ఈ ఏడాది తల్లికి వందనం పథకం అమలు చేసింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి పథకాన్ని వర్తింపజేసింది. అన్నదాత సుఖీభవ అమలు చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించనుంది. అయితే ఇలా మొత్తం పథకాలు అమలవుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పై ఆర్థిక భారం పడుతోంది. అదే సమయంలో విపక్షాలు ఈ పథకాల్లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతున్నారు. మిగతా పథకాల మాట ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు పథకాలు అమలు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే.. ఈ సరికొత్త డిమాండ్లపై రుసరసలాడుతున్నారు ఏపీ మంత్రులు. తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలకమైన ఓ పథకం విషయంలో నోరు జారారు.టిడిపి కూటమి అధికారంలోకి వస్తే ఇంట్లో 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు 1500 రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానమైనదిగా చెప్పుకొచ్చారు. ఆడబిడ్డ నిధి పథకం కింద ఈ సాయాన్ని ఏడాదికి 18 వేల రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో వైసిపి ప్రభుత్వం మహిళలకు ఏడాదికి 18 వేల రూపాయలు అందించిన సంగతి తెలిసిందే. దానికి పూర్తిగా టిడిపి ఎన్నికల్లో ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అంతమందికి ఈ పథకం వర్తింప చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీని అమలు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అయితే దీనిపై తాజాగా స్పందించారు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. ఈ పథకాన్ని అమలు చేయాలంటే ఏపీ ని అమ్మాల్సి ఉంటుందని అన్నారు. ఓ బహిరంగ సభలో ఈ ప్రకటన చేయడంతో అక్కడ ఉన్న వారు షాక్ కు గురయ్యారు. అయితే ఇంతలోనే చేరుకున్న ఆయన ఒక్కసారిగా నవ్వేయడంతో అక్కడ నవ్వులు విరిసాయి.అయితే ఆడబిడ్డ నిధి పథకానికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. పేదరిక నిర్మూలన కోసం పి4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అత్యంత నిరుపేద కుటుంబాలను పైకి తేవాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేశారు. ఆర్థికంగా ఉన్నవారు.. నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే ఆ పథకంలో ఈ ఆడబిడ్డ నిధి పథకాన్ని విలీనం చేసి అమలు చేస్తామని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు. అంటే మార్గదర్శకుల రూపంలో ఉన్నతశ్రేణి వర్గాల నుంచి సాయం తీసుకుని.. నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలన్నదే దీని ప్లాన్. అయితే ఇలా దత్తత తీసుకున్న నిరుపేదల కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆ నిధుల సర్దుబాటుకు నిర్ణయించారు. అయితే రాష్ట్ర క్యాబినెట్ లోని ఓ మంత్రి ఇలా పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని అనడం మాత్రం విస్తు గొలుపుతోంది. అటువంటిప్పుడు హామీ ఎందుకు ఇవ్వాలన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

## యువరైతు ఆత్మహత్యాయత్నం

వరంగల్: రాయపర్తి మండలం బిల్ నాయక్ తండా గ్రామ యువ రైతు రమేష్ నాయక్ మైలారం సబ్ స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నాం చేసాడు. ట్రాన్స్ఫార్మర్ కాలిపోవటంతో రిపేర్ కోసం డిడి కట్టి నెలరోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు కాళ్లు అరిగేలా తిప్పించుకుంటున్నారని ఆరోపించాడు. పంటలు వేసే అనుకూల సమయం అయిపోవడంతో రైతు విసిగి చెంది ట్రాన్స్ఫార్మర్ రిపేర్ చేయటం లేదని అధికారుల ముందే ఆత్మహత్యయత్నాం చేసాడు. రైతుల పంట కాలం అని కనీస బాధ్యత మరిచిన అధికారుల పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కొలికపూడి యూ టర్న్



**విజయవాడ,తెలంగాణ దిశ :** రాజకీయాలు ఎప్పుడు ఒకే విధంగా ఉండవు. ఒకే విధంగా ఉంటే అవి రాజకీయాలు కావు.. అప్పటిదాకా పరస్పర విమర్శలు చేసుకున్న వారు కలిసిపోతారు. అప్పటిదాకా కలిసి ఉన్న నాయకులు విడిపోతారు.. అందువల్లే రాజకీయాలను ఎవరూ స్పష్టంగా అంచనా వేయలేరు. ఇలానే జరుగుతుందని చెప్పలేరు. ఇందుకు ఉదాహరణే ఇది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం గత ప్రభుత్వ తప్పులను వెలికి తీసే పనుల్లో కూటమి ప్రభుత్వం పడింది. ఇందులో భాగంగానే అక్రమాలకు పాల్పడ్డారంటూ కొంతమంది నేతలను కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించింది.. అందులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు ఒకరు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అయితే లిక్కర్ కుంభకోణంలో ఆయన ప్రధాన పాత్రధారి అని.. వేల కోట్లను వేరే వైపు మళ్ళించారని ఆరోపిస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం అభియోగాలు నమోదు చేసింది.. దీనికోసం బలమైన సాక్షాలను.. బలమైన ఆధారాలను కోర్టు ముందు ప్రవేశపెట్టింది. న్యాయమూర్తి అనుమతితో ఆయనను రిమాండ్ కు తరలించింది. ప్రస్తుతం మిధున్ రెడ్డి రాజమండ్రి జైల్లో ఉన్నారు. ఆయనను పరామర్శించడానికి తండ్రి రామచంద్ర రెడ్డి రాజమండ్రి వచ్చారు. రామచంద్ర రెడ్డి రాజమండ్రి విమానాశ్రయంలో ఉండగా ఆయనను టిడిపి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా వారు ఇద్దరు కాసేపు మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో సందడి చేస్తోంది. కొలికపూడి శ్రీనివాసరావు ఏం మాట్లాడారు? దానికి రామచంద్రారెడ్డి ఏం చెప్పారు? అసలు వీరిద్దరికి మాట్లాడుకోవాల్సిన అవసరం ఏం వచ్చింది? కొలికపూడి శ్రీనివాసరావు పార్టీ మారుతున్నారా? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఏపీ రాజకీయాలలో చక్కర్లు కొడుతున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి కొలికపూడి శ్రీనివాసరావు వివాదాస్పద పనులు చేస్తున్నారు. వివాదాలు కు కేంద్ర బిందువుగా మారారు. దీంతో ఆయనపై టిడిపి అధిష్టానం ఆ గ్రహంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో కొలికపూడి శ్రీనివాసరావు టిడిపి ఆస్థాన మీడియాలో కనిపించేవారు. ఆయన విశ్లేషకుడిగా దర్శనమిచ్చేవారు. ఎప్పుడైతే టిడిపి అధిష్టానం ఆయన మీద ఆగ్రహం గా ఉందో.. అప్పటినుంచి శ్రీనివాసరావును టిడిపి ఆస్థాన మీడియా పక్కన పెట్టింది. మరోవైపు ఆయనపై వ్యతిరేకంగా కథనాలను ప్రచురిస్తోంది. ప్రసారం కూడా చేయిస్తోంది. ఇదే నేపథ్యంలో వైసీపీకి అనుకూలంగా ఉండే మీడియా శ్రీనివాసరావుకు పాజిటివ్ వార్తలు రాస్తూ ఉండడం విశేషం. అయితే అప్పట్లోనే శ్రీనివాసరావు వ్యవహార శైలి వేరే విధంగా ఉండడంతో ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వినిపించాయి. అయితే ఆ తర్వాత అలాంటిది ఏమీ లేదని సంకేతాలు ఇవ్వడంతో ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి శ్రీనివాసరావు నియోజకవర్గంలో అనేక వివాదాస్పద పనులకు పాల్పడ్డారు. ఒక అధికారి విషయంలో ఆయన అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని ఆరోపణలు వినిపించాయి. దీనిపై అధిష్టానం ఆయన నుంచి వివరణ కోరినట్టు వార్తలు వినిపించాయి.. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ శ్రీనివాసరావ్ విషయంలో టిడిపి అధిష్టానం కాస్త మెత్తబడినట్టు సమాచారం.. మళ్లీ ఇన్ని రోజులకు శ్రీనివాసరావు వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. ఏకంగా వైసిపిలో కీలక నాయకుడిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. పైగా పెద్దిరెడ్డి మిధన్ రెడ్డి జైల్లో ఉండడం.. కూటమి ప్రభుత్వం రామచంద్ర రెడ్డి పై ఆగ్రహంగా ఉన్న ప్రస్తుత తరుణంలోనే కొలికపూడి శ్రీనివాసరావు ఆయనను కలవడం విశేషం.. అయితే టిడిపి అధిష్టానం ఆగ్రహంగా ఉన్న నేపథ్యంలో శ్రీనివాసరావు పార్టీ మారతారని చర్చ నడుస్తోంది. అందువల్లే రామచంద్ర రెడ్డి తో మంతనాలు జరుపుతున్నారని.. జగన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఫ్యాన్ కండువా కప్పుకోవడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇంతవరకు శ్రీనివాసరావు వర్గీయులు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కొద్దిరోజులుగా వారు మౌనంగానే ఉంటున్నారు. మరోవైపు శ్రీనివాసరావు స్థానికంగా ఉన్న టిడిపి క్యాడర్ కు దూరంగా ఉంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రకారం చూసుకుంటే శ్రీనివాసరావు పార్టీ మారడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## ఆలయాల్లోని హుండీలే లక్ష్యంగా

# వరుస చోరీలు



**శేరిలింగంపలి,తెలంగాణ దిశ :** చందానగర్, మియాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని కొందరు దుండగులు వరుసగా చోరీలకు పాల్పడుతున్నారు. గత వారం గంగారం హనుమాన్ దేవాలయంలో జరిగిన చోరీ మరువకముందే, తాజాగా మరో రెండు దేవాలయాల్లో చోరీలు జరగడం కలకలం రేపింది. చందా నగర్, మియాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సాయిబాబా దేవాల యాల్లో దుండగులు హుండీలను పగలగొట్టి నగదు దొంగిలించారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హుడా కాలనీలో ఉన్న సాయిబాబా మందిరంలో హుండీని పగలగొట్టి అందులోని కానుక లను అపహరించారు. అలాగే, మియాపూర్ జనప్రియ నగర్‌లో గల సాయిబాబా గుడిలోనూ అదే విధంగా హుండీని పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. విషయం తెలిసిన అర్చకులు, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాలను పరిశీలించిన మియాపూర్, చందానగర్ పోలీసులు క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు.సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు: చందానగర్, మియా పూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దేవాలయాల హుండీలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి పట్టుకోవడానికి, పోలీసులు ఆలయాల పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. 15 రోజుల వ్యవధిలోనే ఈ రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు దేవాలయాల్లో చోరీలు జరగడం భక్తులను ఆందోళనకు గురి చేసింది. హుండీలను ఎత్తుకెళ్లిన నిందితు లను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని భక్తులు కోరుతున్నారు.

# అధికారులకు కోర్టు టెన్షన్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రిజర్వేషన్ల సీలింగ్‌ను ఎత్తివేసేందుకు ప్రభుత్వం గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నది. ఆర్డినెన్స్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించిన గవర్నర్, లీగల్ ఒపీనియన్‌కు పంపించినట్లు సమాచారం. దీంతో ఆ ఆర్డినెన్స్‌కు గ్రీన్ సిగ్నల్ కోసం ఉన్నతాధికారులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆ సీలింగ్ తొలగిస్తేనే, రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతున్న నేపథ్యంలో, ఉన్నతాధికారులు తర్జన భర్జన పడుతున్నారు. హైకోర్టు విధించిన గడువు దగ్గర పడుతుండడంతో ఆఫీసర్లు టెన్షన్ పడుతున్నారు. ఒక వైపు సీఎం, సీఎస్‌లు ఫాలో అప్ చేస్తున్నా, ఆలస్యమైతే కోర్టు నుంచి తమకు సమస్యలు ఉంటాయనే భయం అధికారుల్లో ఉన్నది. కంటెంప్ట్ ఆఫ్? కోర్టు కిందకు వస్తుందని సంబంధిత అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఆ ఆర్డినెన్స్‌లో ఎలాంటి చిక్కులు లేకుండా విత్ లీగల్ ఒపీనియన్లతో తయారు చేసి, గవర్నర్‌కు పంపించామని, అయినప్పటికీ ఆలస్యంపై సెక్రటేరియట్‌లోని ఉన్నతాధికారుల్లో టెన్షన్ మొదలైంది. కోర్టు విధించిన సమయం వరకే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో గవర్నర్ వద్ద ఆర్డినెన్స్ క్లియర్ చేపించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అంతా ఫోకస్ పెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఏకంగా ఢిల్లీ నుంచి ఫాలో అప్ చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 30 రోజుల్లో పూర్తి చేయాలని జూన్ 24న హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. 90 రోజుల్లో (సెప్టెంబర్ నెలాఖరులోగా) స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో ప్రభుత్వం హడావుడిగా ఆ ప్రాసెస్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నది. కనీసం జూలై చివరి వరకైనా ఆర్డినెన్స్ ఆమోదం పొందేలా ప్రయత్నాలు చేస్తున్నారు. క్యాప్ తొలగిస్తేనే రిజర్వేషన్లు సాధ్యం? పంచాయతీ రాజ్ యాక్ట్ 2018?29 ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సీలింగ్ ఉన్నది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఈ సీలింగ్ విధించామని గత ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ, పరిస్థితులను అనుగుణంగా రిజర్వేషన్లు మార్చుకోవచ్చన్న క్లాజ్ కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

దీని ఆధారంగానే సుప్రీం కోర్టు చెప్పిన తర్వాత కూడా రెండు మూడు రాష్?ట్రాలు ఈ సీలింగ్‌ను తొలగించినట్లు చేసినట్లు ఓ అధికారి తెలిపారు. ఇప్పుడు తెలంగాణలోనూ పంచాయతీ రాజ్ చట్టంలోని రిజర్వేషన్ల సీలింగ్‌ను తొలగిస్తేనే, 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకే గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపారు. అది క్లియర్ కాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇవ్వనున్నది. ఆ జీవో కేవలం లోకల్ బాడీ రిజర్వేషన్లపై మాత్రమే ప్రస్తావిస్తుంది. విద్యా, ఉద్యోగాల్లో మాత్రం తప్పనిసరిగా రాష్?ట్రపతి వద్ద ఉన్న బిల్లు క్లియర్ కావాల్సిందేనని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. తర్వాత ఏంటి? తెలంగాణ అసెంబ్లీ తీర్మానం 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది. అయితే, ఇది క్లియర్ అయ్యే ఛాన్స్ చాలా తక్కువేనని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.

రాజకీయ మైలేజ్ కోణంలో అప్రూవల్ ఇవ్వకపోవచ్చనే చర్చ జరుగుతున్నది. అయితే, దీనిపై పార్లమెంట్, రాజ్యసభలో ఫైట్ చేసేందుకు కాంగ్రెస్ ఎంపీలు సిద్ధమయ్యారు. అంతేగాక వివిధ రాష్ట్రాల నుంచి పార్లమెంట్, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీల మద్ధతునూ కూడగడుతున్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు.

కేంద్ర ప్రకటించిన జనగణనకు తెలంగాణ డేటా మోడల్‌గా పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వివరిస్తుంది. కానీ, కేంద్రం ఎలా స్పందిస్తుందనే దానికి ఉత్కంఠగా మారింది. అయితే, కేంద్ర 42 శాతం బిల్లుపై లైట్ తీసుకుంటే, ఢిల్లీలో పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి క్లియర్‌గా చెప్పారు. గతంలో నల్లచట్టాలను తెచ్చినప్పుడు కూడా బీజేపీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించిందని, ప్రతిపక్షాలు తెచ్చిన ప్రెజర్‌తో వాటిని రద్దు చేసుకున్నట్లు వివరించారు. ఇప్పుడు కూడా తమకు ప్రత్యేక స్ట్రాటజీ ఉన్నదని, తప్పనిసరిగా 42 శాతం రిజర్వేషన్‌ను ఒప్పిస్తామని సీఎం ధీమాతో ఉన్నారు

## చలో గోవా పోస్టర్ ఆవిష్కరణ చేసిన బీసీ మహిళా సంఘం



**కరీంనగర్,తెలంగాణ దిశ :** ఆగస్టు 7న గోవాలో జరిగే అఖిలభారత జాతీయ ఓబీసీ 10వ మహాసభను విజయవంతం చేయా లని బీసీ మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని పిలుపునిచ్చారు. అనంతరం సంతోషిని మాట్లాడుతూ కరీంనగర్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ పిలుపుమేరకు మహిళా సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ దుర్శేడ్ గ్రామంలో చేశామని తెలిపారు. ఓబిసి మహాసభ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరుగుతున్నట్లు తెలిపారు ఓబిసి మహాసభ విజయవ ంతం చేయాలని 42 శాతం అసెంబ్లీలో ఆమోదం పొందిన ఓబిసి రిజర్వేషన్ బిల్లును కేంద్రం 9వ షెడ్యూల్లో చేర్చితెలంగాణ బీసీలకు న్యాయం చేయాలనిప్రధానడిమాండ్తో జాతీయ ఓబిసి మహాసభలో అనేక తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహాసభకు బీసీలు తరలివచ్చి మేమెంతో మాకంత,హాలో బిసి దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరించుదాం అనే నినాదంతో బీసీ రిజర్వేషన్ల ఆరాధ్యు లు బిపిమండల్ డే సందర్భంగా ఆగస్టు 7న గోవా రాష్ట్రంలో అఖిల భారత జాతీయ ఓబిసి పదవ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళ ఉపాధ్యక్షురాలు వీరగోని వరలక్ష్మి ,భారతి, అరుణ, అనిత, భాగ్యలక్ష్మి,సులోచన, రాజేశ్వరి,శ్రీమతితో పాటుమహిళలు పాల్గొన్నారు.



# శ్రావణమాసం

## వ్రతాలు, నోములకు పెద్దపీట

**తిరుమల,తెలంగాణ దిశ :** తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. శ్రావణ మాసం వర్ష ఋతువులో వస్తుంది.. కనుక విరివిగా వర్షాలు కురుస్తాయి. ఈ నెల హిందువుల లోగిళ్ళు ఆలయాలను తలపిస్తాయి. విష్ణువు, లక్ష్మీదేవులకు అత్యంత ఇష్టమైన మాసం శ్రావణ మాసం.. ఈ నెలలో మహిళలు వ్రతాలు, నోములు, పూజలను ఆచరిస్తారు. ఈ నెలలలో ఆచరించే పూజల వలన విశేష ఫలితాలు లభిస్తాయని పెద్దల చెబుతారు. పౌర్ణమి రోజున చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు.. కనుక ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం.. ఈ నక్షత్రం పేరుతొ ఏర్పడిన శ్రావణమాసం అని.. ఈ మాసంలో చేసే పూజలు అత్యంత ఫలప్రదమని పురాణాల కథనం. లక్ష్మీ ప్రదమైన మాసం.. శ్రావణ మాసం ఈ ఏడాది వ తేదీ నుంచి ప్రారంభం అయ్యింది. శ్రావణ మాసం వచ్చిందంటే చాలు మహిళలు ఆనందిస్తారు. తొలిరోజే తో ప్రారంభం కావడం విశేషం. ఇకపోతే శ్రావణం ప్రధానంగా వ్రతాలు, నోములకు ప్రసిద్ధి. మంగళవారం మంగళగౌరి వ్రతం.. ఈ మాసంలో మంగళవారం రోజున మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. పార్వతి దేవికి మరొక పేరు గౌరీ దేవిని పూజిస్తారు. ముఖ్యంగా కొత్తగా పెళ్ళయిన వధువులు.. తప్పనిసరిగా ఈ వ్రతాన్ని చేస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల మహిళలు నిండు ముత్తయిదువులుగా జీవిస్తారని ప్రతీతి. ఈ మాసంలో శ్రీ వరలక్ష్మి దేవిని పూజిస్తూ.. ప్రతి వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. ముఖ్యంగా పూర్ణిమ ముందు వచ్చే రోజున మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ రోజున వరలక్ష్మీ దేవతను పూజిస్తే అష్టలక్ష్మి పూజలకు సమానమని నమ్మకం. అంతేకాదు ఈరోజున లక్ష్మీదేవిని పూజిస్తే అష్టయిశ్వర్యాలైన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. లక్ష్మీదేవి అనుగ్రహంతో కుటుంబం సుఖ సంతోషాలతో నెలకొంటుందని విశ్వాసం. దీపావళి తర్వాత జరుపుకొనే నాగులచవితి లాగ.. కొన్ని ప్రాంతాల్లో నాగుల పంచమిని జరుపుకుంటారు. ఈ రోజున నాగులకు పూజలను నిర్వహిస్తారు. పుట్ట వద్దకు వెళ్ళి పాలు పోసి, నాగ దేవతను పూజిస్తారు. ఉపవాసం ఉంటారు. శ్రావణశుద్ధ ఏకాదశిని పుత్రదా ఏకాదశి లేదా లలిత ఏకాదశి అంటారు. సంతానం లేనివారు వ్రతాన్ని ఆచరించడం శుభఫలితాను ఇస్తుంది. అంతేకాదు ఈరోజున గొడుగు దానమిస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చని పురాణాలు పేర్కొన్నాయి. శ్రావణ రాఖీపూర్ణిమ లేదా జంధ్యాల పౌర్ణమి రోజు తన సోదరిని మేలు కోరుతూ సోదరి.. సోదరుని చేతికి రాఖీ కట్టే పండుగే ఈ రాఖీ పూర్ణిమ. అన్నదమ్ములకు రాఖీ కట్టి, నుదుట బొట్టు పెట్టి అనంతరం మిఠాయిలను తినిపిస్తారు.


సోదరుడు సోదరిని ఆశీర్వదించి కానుకలివ్వడం ఆనవాయితీ. దీనినే జంధ్యాల పౌర్ణమి అని కూడా అంటారు. యజ్ఞోపవీతాన్ని విసర్జించి కొత్తది ధరించడం ఆచారం. అందుకనే ఈ పౌర్ణమిని జంధ్యాల పూర్ణిమ అని కూడా అంటారు. శ్రావణ పున్నమి రోజున శ్రీమహావిష్ణువు వేదాలను రక్షించడం కోసం హయగ్రీవ రూపం ధరించినట్లు పురాణాలు పేర్కొన్నాయి. అందుకనే ఈరోజున కొన్ని ప్రాంతాల వారు హయగ్రీవ జయంతిగా జరుపుకుంటారు. అయన అనుగ్రహం కోసం పూజలు నిర్వహించి.. శనగలు, ఉలవలతో గుగ్గి ళ్ళు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. తుంగభద్రానది తీరంలో మంత్రాలయంలో కొలువైన శ్రీ గురు రాఘవేంద్రస్వామి జయంతి వేడుకలను శ్రావణ కృష్ణ విదియరోజున ఘనంగా నిర్వహిస్తారు. దుష్టశిక్షణ.. శిష్టరక్షణ కోసం శ్రీ మహావిష్ణువు ఎత్తిన ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణ అవతారం. శ్రీకృష్ణపరమాత్మ జన్మించిన రోజు శ్రీకృష్ణాష్టమి. ఈరోజుని కృష్ణాష్టమి గా దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈరోజు ఉట్టికొట్టడం ఆచారం. ఈ మాసంలో బహుళ పక్షంలో వచ్చే ఏకాదశిని కామిక ఏకాదశి అని అంటారు. ఈరోజున నవనీతాన్ని (వెన్న) దానం చేయడం వలన ఆర్ధిక ఇబ్బందులు తొలగుతాయని నమ్మకం. శ్రావణ మాసములో కృష్ణపక్ష అమావాస్యని పొలాల అమావాస్యగా పిలుస్తారు. సంతానం కోసం ఈరోజున మహిళలు ప్రత్యేక పూజను నిర్వహిస్తారు. ఈరోజున అమ్మవారిని పూజిస్తే.. పిల్లలు కలుగుతారని నమ్మకం.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి





**కమాన్‌పూర్,తెలంగాణ దిశ :**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని ఎంపీడీవో గంగాల లలిత అన్నారు. కమాన్ పూర్ మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛ నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గుండారం జూలపల్లి పేరా పల్లి రొంపిగుంట సిద్దిపల్లె పెంచికలపేట తదితర గ్రామాల్లో రోజున స్వచ్ఛ నిర్వహించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో ఆమె వివిధ వార్డుల్లో స్వచ్ఛ లో ఈ సందర్భంగా మేము మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద దోమలు పెరగకుండా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆమె ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎం పి ఓ అల్వాల మారుతి గ్రామ కార్యదర్శు లు ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఐకెపి కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వకుండా చూడాలని తమ తమ ఇండ్లలో ఉన్న నీటిని విలువలను తొలగించాలని కోరారు. తమతమ యిండ్ల వద్ద మూర్తి నీరు నిల్వకుండా చూడాలని కోరారు. దీంతో దోమలు పెరిగే వ్యాధులు ప్రభలించే విష జ్వరాలు వస్తాయని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రామ్మోహన్, బచ్చుల ప్రసాద్, ప్రవళిక, జంజర్ల అమల, అమీనా భాను, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లుగా టాప్ లోనే.. రెమ్యునరేషన్ కూడా అదే స్థాయిలో..



హీరోయిన్ అనుష్కకు ఉన్న క్రేజే వేరు. స్పెషల్ ఫ్యాన్ బేస్ ఆరడుగుల అందగత్తె సొంతం. ఇప్పటికీ టాలీవుడ్ లో ఎంత మంది హీరోయిన్స్ వస్తున్నా.. చాలా మంది మాత్రం అనుష్కనే ఫేవరెట్ అని చెబుతుంటారు. అంతలా గుర్తింపు సంపాదించుకుంది అమ్మడు. సినిమాలు కాస్త తగ్గించినా ఆమె క్రేజ్ మాత్రం అలానే ఉంది. యోగా టీచర్ అయిన అనుష్క అనుకోకుండానే యాక్టింగ్ ఫీల్డ్ లోకి వచ్చారు. టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున హీరోగా వచ్చిన సూపర్ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చారు. సాషాగా గ్లామరస్ గా కనిపించి మెప్పించారు. డెబ్యూతోనే అనుష్క మూడు ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్, చెరో రెండు నంది, రెండు సూపర్ మూవీ తర్వాత మహా నందిలో యాక్ట్ చేసినా మెప్పించలేకపోయారు. అనంతరం ఎస్ ఎస్ రాజమౌళి డైరెక్షన్ లో వచ్చిన విక్రమార్కుడు సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అనుష్క క్రేజ్ భారీగా పెరిగిపోయింది. స్టార్ హీరోయిన్ గా అనుష్క మారిపోయారు. ఆ తర్వాత మళ్లీ కొన్ని చిత్రాలతో నిరాశపరిచారు. అదే సమయంలో తెలుగు డార్క్ ఫాంటసీ చిత్రం అరుంధతిలో ఛాన్స్ అందుకున్న ఆమె.. డ్యూయల్ రోల్ పోషించారు. తన అందం, అభినయంతో తెలుగు సినీ ప్రియులను కంప్లీట్ గా ఫిదా చేశారు. కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా సంచలన విజయం సాధించడంతో.. లేడీ సూపర్ స్టార్ గా మారిపో యారు. ఆ తర్వాత వివిధ సినిమాల్లో నటించిన అనుష్క.. బాహుబలి మూవీతో పాన్ ఇండియా స్టార్ గా మారిపోయారని చెప్పాలి. అయితే అరుంధతి మూవీ తర్వాత నుంచి హైయెస్ట్ రెమ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్ గా కొనసాగుతోంది అమ్మడు. సుమారు పదేళ్లుగా ఆమెనే టాప్ లో ఉంది. ఇప్పటికే అనుష్కనే కంటిన్యూ అవుతుందట. గతంలో మూడు కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్న అనుష్క ఇప్పుడు ఏకంగా 6 కోట్ల రూపాయల రేంజ్ లో రెమ్యునరేషన్ తీసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న ఘాటీతోపాటు ఓమాలీవుడ్ మూవీకి కూడా అంతే రేంజ్ లో అందుకుంటున్నారని సమచారం. మొత్తానికి రెమ్యునరేషన్ విషయంలో అనుష్క ఇంకా టాప్ హీరోయిన్ గానే ఉండడం విశేషం.

# అతనికి ఇంప్రెస్ అయిన నయన్..!



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో మెగా మూవీకి సైన్ చేసింది. మెగాస్టార్ చిరంజీవి 157 సినిమాలో చిరంజీవి సరసన నటిస్తుంది నయనతార. ఆల్రెడీ ఈ ఇద్దరు సైరా నరసింహారెడ్డి సినిమాలో కలిసి జత కట్టారు. ఆ తర్వాత మళ్లీ అనిల్ రావిపూడి సినిమాకు పనిచేస్తున్నారు. ఐతే పెళ్లి తర్వాత నయనతార చాలా సెలెక్టెడ్ గా సినిమాలు చేస్తుంది. ఇతర భాషల సినిమాలైతే మాక్సిమం కాదనేస్తుంది. కానీ చిరుతో సినిమా అది కూడా అనిల్ డైరెక్షన్ లో అనేసరికి ఆసక్తి చూపించింది. అనిల్ రావిపూడి సినిమా షూటింగ్ ఎంట్రీ తోనే నయనతార ఒక క్రేజీ వీడియోతో హాయ్ చెప్పింది. ఇక సినిమాలో ఆమె రోల్ కూడా క్రేజీగా ఉండబోతుందని తెలుస్తుంది. సినిమాలో చిరంజీవి పి.ఈ.టి మాస్టర్ గా కనిపిస్తాడట. నయన్ పాత్ర గురించి డీటైల్స్ బయటకు రాలేదు. ఐతే అనిల్ వర్కింగ్ స్టైల్ కి నయనతార ఫిదా అయ్యిందని టాక్. ఎందుకంటే అసలేమాత్రం మిస్ యూజ్ లేకుండా స్టార్ డేట్స్ ని వాడుతున్నాడట అనిల్ రావిపూడి. అందుకే నయనతారకి కూడా అతను బాగా నచ్చేశాడట. అనిల్ రావిపూడితో పనిచేసిన ఎవరైనా ఈ మాటే చెబుతారు. నయనతార తెలుగు సినిమా చేయాలనుకోవడమే షాకింగ్ థింగ్ అయితే.. సినిమా అనుకున్న విధంగా చక చకా కానివ్వడం చూసి ఆమె సర్ ప్రైజ్ అవుతుందట. స్టార్స్ ని డేట్స్ అడిగి.. దానికి ఒకటి రెండు రోజులు అదనంగా తీసుకునే డైరెక్టర్స్ ని చూశాం కానీ అనిల్ ఇచ్చిన స్టార్ డేట్స్ కి రెండు రోజుల ముందే షెడ్యూల్ పూర్తి చేస్తాడట. అందుకే అతని గురించి అందరు పాజిటివ్ గా చెప్పుకుంటున్నారు. నయనతార కూడా ఇంప్రెస్ అయ్యింది అంటే ఆమెను మళ్లీ మళ్లీ తన సినిమాల్లో తీసుకునే ఛాన్స్ ఉంటుంది.

# హరిహర వీరమల్లు సినిమా కోట చివరి చిత్రం..



తెలుగు చిత్ర పరిశ్రమలో కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడిగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. 1978లో చిరంజీవి సినిమా ప్రాణం ఖరీదు చిత్రంతో ఆయన ఇండస్ట్రీకి ఆరంగేట్రం చేశారు. కమెడియన్ గా , విలన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సుమారు 850 సినిమాల్లో నటించిన ఆయనని భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. అలాగే ఆయన నటనా ప్రతిభకు ప్రతీకగా తొమ్మిది నంది అవార్డులు కూడా దక్కాయి. కోట శ్రీనివాసరావు నటుడిగానే కాకుండా రాజకీయవేత్తగానూ రాణించారు. 1999- 2004 మధ్య కాలంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన తర్వాత పాలిటిక్స్‌కి దూరంగా ఉండి తన దృష్టి మొత్తం సినిమాలపైనే పెట్టారు.

అనంతరం అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన ఆయన ఎక్కువగా సినిమాల్లో కనిపించలేదు. చివరిగా పవన్ కల్యాణ్ హరి హర వీరమల్లులో నటించారు కోట. కోట నటించిన చివరి చిత్రం హరి హర వీరమల్లు జులై 24న విడుదల కాగా, ఆయన జూలై 13న కన్నుమూసిన విషయం తెలిసిందే. వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, తుదిశ్వాస విడిచారు. కోట మరణించిన 11 రోజులకి ఆయన చివరిసారి నటించిన చిత్రం 'హరిహర వీరమల్లు' థియేటర్లలో విడుదలైంది. కొద్ది సంవత్సరాలుగా సినిమాలకు దూరంగా ఉన్నా,

మంచి కథలు వస్తే నటించేందుకు ఆసక్తి చూపుతూ వచ్చారు. ఈ క్రమంలో కొన్ని చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించారు కోట శ్రీనివాసరావు . అదే తరహాలో, పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాలో ఆయన ఒక కీలక పాత్రలో నటించారు. ఈ సినిమాలో కోట 'కొల్లూరు సంస్థాన రాజు'గా కనిపించారు.


# అఖండ 2 సస్పెన్స్ తీరేది ఎప్పుడు..?



నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న అఖండ 2 సినిమా అసలైతే సెప్టెంబర్ 25న రిలీజ్ లాక్ చేసుకున్నారు. టీజర్ తోనే సినిమాపై హ్యూజ్ బజ్ ఏర్పడేలా చేశారు మేకర్స్. సినిమాలో బాలయ్య మాస్ విధ్వంసంతో రికార్డులచెడుగుడు ఆడేస్తాడని అంటున్నారు. సం యుక్త మీనన్, ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్స్ గా నటిస్తున్న అఖండ 2 కి మరోసారి థమన్ తన మాస్ డ్యూటీ చేస్తున్నాడట. అఖండ 2 సినిమాను దసరాకి రిలీజ్ ఫిక్స్ అనుకున్నారు. కానీ సినిమా పాన్ ఇండియా వైడ్ రిలీజ్ చేసే క్రమంలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ ఇంకాస్త బాగా చేయాలని ఆలోచిస్తున్నారట. అందుకే హుర్రి బర్రి అన్నట్టు కాకుండా సినిమాను అనుకున్న విధంగా అవుట్ పుట్ వచ్చే వరకు చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో అనుకున్న సెప్టెంబర్ 25 రిలీజ్ డేట్ కూడా మారే అవకాశాలు ఉన్నాయట. ఐతే అఫీషియల్ గా చిత్ర యూనిట్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయలేదు. ఐతే దసరా కి అదే సెప్టెంబర్ 25కి ఆల్రెడీ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఓజీ సినిమాను సుజిత్ డైరెక్ట్ చేస్తున్నాడు. దానయ్య డివివి భారీబడ్జెట్ తో ఈ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. రీసెంట్ గా జరిగిన వీరమల్లు ఈవెంట్ లో కూడా ఓజీఓజీ అనే కేకలు వేశారు. అఖండ2 వస్తుందో లేదోఅన్నది తెలియదు కానీ ఓజీ మాత్రం తప్పనిసరిగా సెప్టెంబర్ 25 వచ్చి తీరుతుంది. అఖండ 2 రిలీజ్ డేట్ పై కన్ ఫ్యూజన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. బోయపాటి శ్రీను ఈ సినిమా మీద స్పెషల్ ఫోకస్ తో పనిచేస్తు న్నారని తెలుస్తుంది. రిలీజ్ డేట్ముఖ్యం కాదుసినిమా ఆడియన్స్ ని అలరించేలా చేయడం ముఖ్యం. అందుకే అఖండ2 రిలీజ్ పై ఇంకా స్పష్టత తీసుకోలేదు. ఒకవేళ అఖండ 2 దసరా రేసు నుంచి తప్పుకుంటే మాత్రం పవర్ స్టార్ ఓజీకి కలిసి వచ్చినట్టే. ఐతే దసరాకి అఖండ 2 మిస్ అయితే తమిళ సినిమాలు ఏవైనా వచ్చే ఛాన్స్ ఉంది. ఐతే ఆ సినిమాలు ఏంటి అన్నది కూడా మరికొద్దిరోజుల్లో తెలుస్తుంది.

# ఎంత హైటున్న హీరో అయినా ఒకే!





టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్ర కారులో క్రేజీ బ్యూటీగా మారిపో యింది. వైవిధ్యమైన హావభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే సింగిల్ తో తెలుగులోనూ లాంచ్ అయింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. కేతిక పాత్ర కంటే ఇవానా పాత్రకే మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో ఓ ఛాన్స్ అందు కుందనే ప్రచారం జరుగుతోంది. సక్సెస్ పరంగా ఇవానా ట్రాక్ బాగుంది. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ పాజిటివ్ గానే కనిపి స్తుంది. యూత్ లోనూ క్రేజీ బ్యూటీగా వైరల్ అవుతోంది. -సింగిల్- తర్వాత తెలుగులో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇక ఇవానా వయసు విషయానికి వస్తే అమ్మడికి 25 ఏళ్లు. అంటే స్టార్ హీరోలందరితో నటించే వయసే. 20 ఏళ్ల నటే 50-40 ఏళ్ల వయసున్న హీరోలతో రొమాన్స్ చేస్తున్నారు. కాబట్టి ఇవానికి వయసు అడ్డండి కాదు. మరి హైట్ సంగతేంటి? అంటే అమ్మడు ఎత్తు ఐదు అడుగులే. అయినా సరే నటిగా తానెంత ఎంత పెద్ద స్టార్ అయినా....ఎంత హైట్ ఉన్నా సరే మ్యానేజ్ చేస్తానంటూ నమ్మకాన్ని వ్యక్తం చేసింది. నటికి హైట్ అన్నది పెద్ద సమస్య కాదని ధీమా వ్యక్తం చేసింది. నిజమే నిజం గా హైట్ సమస్య అయితే రష్మికా మందన్నా నేషనల్ క్రష్ అయ్యేదా? నేడు రష్మిక పాన్ ఇండియా క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు.

రష్మిక ఇవానా కంటే కాస్త పొడవు. 5.3 రష్మిక హైట్. కానీ కెమెరా యాంగిల్ లో రష్మిక కంటే ఇవానా ఎత్తుగా కనిపిస్తుంది. శరీరంలో కొన్ని రకాల మార్పులే ఇలాంటి వ్యత్యాసానికి దారి తీస్తుంటాయి? అన్నది తెలిసిందే. ప్రస్తుతం ఇవానా టాలీవుడ్ నే టార్గెట్ చేసి పనిచేస్తున్నట్లు తెలిపింది. ఇక్కడ అవకాశాలు వస్తే ఇక్కడే బిజీ అవ్వాలని కోరుకుంటుంది. నటిగా ఇవానాను ఎంచాల్సిన పనిలేదు. మంచి పెర్ఫార్మర్. యువ నాయికలకు బాగా సెట్ అవుతుంది. కెరీర్ ఇప్పుడే మొదలైంది కాబట్టి నిర్మాతలకు అందుబాటులో ఉంటుంది. మరి ఇవానా ప్రతిభను ఎంత మంది గుర్తిస్తారో చూడాలి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215